సంచిక 189 సంపుటం 13 రిజిస్టరు నెం. H 45 స్థాపితం 1925

గోలకొండ పత్రిక

హైదరాబాదు 13—8—1960 శనివారము

సంపాదకుడు: ఎస్. నరోత్తమరెడ్డి ఎం. ఎ.

4 పేజీలు 7 నయాపైసలు

భారత-జపాన్ దేశాల వ్యాపార సంబంధాలు

హైదరాబాద్, ఆగస్టు 12: ప్రస్తుతం భారత దేశంలో పర్యటిస్తున్న 10 మంది సభ్యులుగల జపాన్ వ్యాపార ప్రతినిధివర్గం నాయకుడు ఇమా మూరో ఓ జావా పరస్పర ప్రయోజనానికై వ్యాపార, వాణిజ్యాల అభివృద్ధికిగాను ఉభయ దేశాలమధ్య వ్యాపార, సాంస్కృతిక ప్రతినిధివర్గాల రాకపోకలు కొనసాగాలన్నారు. ఆంధ్రవాణిజ్యమండలి వారి గౌరవార్థం నేటి సాయంత్రం విందుచేసింది. మండలి అధ్యక్షుడు శ్రీ బండారి వారికి స్వాగతం చెప్పారు: ఈ ప్రతినిధివర్గం రేపు బయలుదేరి బొంబాయి వెడుతుంది. ఇండియాగాక యింకా అనేక దేశాలలో పర్యటిస్తుంది.

తృతీయ ప్రణాళిక ఆశయ లక్ష్యాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: పార్లమెంటు సభ్యుల సలహాసంఘం నేడు రెండుగంటలపాటు సమావేశమై తృతీయ ప్రణాళిక ఆశయాదర్శాల్ని గురించి చర్చించినది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలు, రంగాల మధ్యగల వ్యత్యాసాల్ని తొలగించి వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్రోత్సాహము యిచ్చే చర్యల్ని అమలు జరపడం అవసరమని సభ్యులు పేర్కొన్నారు. జనాభా నిరోధానికి ప్రాధాన్యం యివ్వాలని కూడ పేర్కొనబడింది. అధ్యక్షత వహించిన ప్లానింగ్ మంత్రి శ్రీ నందా కుటుంబ నియంత్రణ జయప్రదంకావాలని చెప్పిన ఒక సభ్యుని ఆచరణయోగ్యమైన సలహా యివ్వమని ప్రభుత్వం గర్భ నిరోధ పదార్థాల్ని తయారు చేయించాలన్నారు.

వెనుక బడిన వారికి సహాయంచేసే విషయమై కేంద్ర వైఖరి

వ్యవసాయోత్పత్తుల విషయమై సలహా

ఇచ్చేందుకు త్వరలో ఒక ఉన్నతాధికార సంఘం నెలకొల్పబడుతుందని శ్రీ పాటిల్ ప్రకటన

బొంబాయి, ఆగస్టు 12

అన్నిరకాల వ్యవసాయోత్పత్తులకు సంబంధించి ప్రభుత్వానికి తగుసలహాలిచ్చేందుకుగాను ఒక ఉన్నతాధికార సంఘం నియమించబడుతుందని కేంద్ర ఆహార, వ్యవసాయమంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్ యీవాళ ఇక్కడ పత్తి వ్యవహారాల భారత కేంద్రీ సంఘం 8వ అర్ధసాంవత్సరిక సమావేశానికి ప్రారంభోత్సవం జరుపుతూ సూచించారు.

వ్యవసాయ రంగాన్ని పటిష్టమైన ప్రాతిపదికపై అభివృద్ధిచేస్తేనేతప్ప దేశపు ఆర్థికాభివృద్ధిని సాధించడం వీలుపడదనీ ఇప్పుడు నిర్వహించబడుతున్న వివిధ పరిశోధనా పథకాల ఫలితాలను రైతులకు అందజేయడం ఎంతయినా అవసరమని శ్రీ పాటిల్ అన్నారు.

ఇప్పుడు వెలకొల్పతలపెట్టిన వ్యవసాయ నరుకుల సలహాసంఘం వ్యవసాయోత్పత్తిని సర్వదా సమీక్షిస్తూ, ఎంత ఎరువు కావాలో, ఏ పంటల క్రింద ఎంత భూవిస్తీర్ణం వుండాలో, నేద్యపు నీటి సౌకర్యాల తీరు ఎలా వుండాలో, ఒక టేమిటి, వ్యవసాయ రంగానికి సంబంధించినసర్వ అంశాలను గురించి తగు సలహాలివ్వగలదని తాను ఆశిస్తున్నానని శ్రీ పాటిల్ చెప్పారు. ఈ సంఘం ఒక్క ధరల నిర్ణయ సంఘంగానే కాకుండా, వ్యవసాయ సమస్యలకు సంబంధించిన అన్ని విషయాలనూ కూలంకషంగా పరిశీలిస్తుందని ఆయన అన్నారు.

ప్రత్తిధరలను ఎక్కువ చేయాలన్న వాదాన్ని గురించి ప్రస్తావిస్తూ, యీ విషయమై నిర్ణయం చేసే ముందు వస్త్రాల ధరలూ, ఎగుమతులూ—యీ మొదలైన అంశాలకుగల ప్రభావాన్ని గురించి ప్రభుత్వం పరిశీలన జరపవలసివుందని శ్రీ పాటిల్ అన్నారు.

అన్నం, వస్త్రం, వసతి—యివి మనిషికి కావలసిన ప్రాథమిక అవసరాలనీ, వస్త్రాలకు సంబంధించినంతవరకూ, భారత జవుళి పరిశ్రమ దేశావసరాలను తీర్చడానికేకాక, విదేశాలకు ఎగుమతి చేసేందుకుకూడా మిగులుగా వుండేట్లు వస్త్రోత్పత్తి సాగిస్తోందనీ ఆయన చెప్పారు.

మేలిరకాల పత్తిసేద్యాన్ని విస్తృత పరచి, అభివృద్ధి చేసేందుకు యితోధిక శ్రద్ధవహించాలని ఆయన ఉద్బోధించారు.

ప్రథమ, ద్వితీయ ప్రణాళికా కాలములో పత్తి ఉత్పత్తిని గురించి ప్రస్తావించి, ప్రథమ ప్రణాళిక క్రింద పత్తి ఉత్పత్తి లక్ష్యం సాధించబడిందనీ, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున ద్వితీయ ప్రణాళికా కాలములో ఆ లక్ష్యం సాధించ వీలులేక పోయిందనీ, శ్రీ పాటిల్ చెప్పారు. 1960-61 లో 54 లక్షల బేళ్ళ పత్తి ఉత్పత్తి కాగలదని అంచనా వేయబడిందని ఆయన తెలియజేశారు.

తృతీయ ప్రణాళికా లక్ష్యం

తృతీయ ప్రణాళికాకాలంలో 72 లక్షల బేళ్ళ ఉత్పత్తి కావాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ఆమోదించిందనీ, యీలక్ష్యసాధనకుగాను రైతులకు అవసరమైన సౌకర్యాలుకల్పించేందుకు కృషిచేయాలనీ శ్రీపాటిల్ అన్నారు.

ఈజిప్టు యునైటెడు స్టేట్సు, సోవియటు రష్యాలలోకన్న భారతదేశములో పత్తి ఎకరా ఉత్పత్తి చాలా తక్కువగా వుండడాన్ని గురించి ప్రస్తావించి ఎకరా ఉత్పత్తిని పెంపొందించేందుకు పత్తి వ్యవహారాల భారతకేంద్ర సంస్థ తీసుకున్న చర్యలను ఆయన కొనియాడారు. పంట పరిశోధనల ఫలితాలను ఎప్పటికప్పుడు రైతుకు అందజేయడం ఎంతయినా అవసరమనీ, సేద్యపు నీటి సౌకర్యాలు కల్పించడం ద్వారాను, మేలిరకం విత్తనాలనూ, ఎరువులను ఉపయోగించడంద్వారాను మేలిరకం సాగుపద్ధతులను అనుసరించడంద్వారానూ, మొక్కలకు తెగుళ్లు పట్టకుండా జాగ్రత్త వహించడం ద్వారానూ ఎకరా ఉత్పత్తి పెంపొందించడంవీలవుతుందనిఆయనచెప్పారు.

లంకపత్తి

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ ఉపాధ్యక్షుడూ, కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శీ డాక్టర్ ఎమ్ ఎస్. రంధవా ప్రసంగిస్తూ కేరళ, మైసూరు రాష్ట్రాలలో లంకపత్తి సేద్యం మందకొడిగా అయినా క్రమాభివృద్ధి సాధించడం అవుతోందని అన్నారు. 1956-60 లో లంకపత్తి పంట విస్తీర్ణం 3966 ఎకరాలనీ, మొత్తం ఉత్పత్తి 494 బేళ్ళనీ ఆయన తెలియజేశారు. 1990-61లో ఆరకంపత్తి దాదాపు పదివేల ఎకరాలలో వేయబడిందనీ అన్నారు.

ఈసంఘం తాలూకు సాంకేతిక పరిశోధనాలయం విస్తరణ, అధునికీకరణలను గురించి ప్రస్తావిస్తూ యీ దేశంలో పత్తిసేద్యం బాగా అభివృద్ధి కావడానికి అది దోహదంచేయగలదన్న ఆశాభావాన్ని డా॥ రంధవా వ్యక్తపరిచారు.

ఈశతాబ్దపు గత పాదంలో పత్తి పంట రంగంలో సాగించిన వివిధ పరిశోధనల ఫలితాలను క్రోడీకరిస్తూ, ఒక పుస్తకం వెలువరించడంలో భారత కేంద్ర పత్తివ్యవహారాల సంఘం సాగించిన కృషిని ఆయన కొనియాడారు.

హిందీతరులు మార్పును కోరేవరకూ ఇంగ్లీష్

నెహ్రూ హామీకి రాజాజీహర్షం

మద్రాసు, ఆగస్టు 12

స్వతంత్రపార్టీ వ్యవస్థాపకుడు శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారి నిన్న ప్రధాని నెహ్రూ విలేకరుల గోష్ఠిలో హిందీ విషయమై యిచ్చిన హామీని ఆహ్వానించారు. "హిందీతర ప్రజలు మార్పును కోరేంతవరకూ ఇంగ్లీషు కొనసాగుతుంది" అని నెహ్రూ చెప్పిన అంశం చాల ముఖ్యమైనదనీ దీన్ని రాష్ట్రపతి ఉత్తర్వులో జతపరచాలనీ ఆయనన్నారు.

ఆర్థిక ప్రాతిపదికపైనే జరగాలనే ప్రతిపాదనను వ్యతిరేకించాలి

హరిజన, గిరిజన, వెనుక బడిన తరగతుల వారికి ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య విజ్ఞప్తి

కులమే ప్రాతిపదికగా ఉండాలని ఉద్ఘాటన

హైదరాబాద్, ఆగస్టు 12

ప్రస్తుతమువలె కులాన్ని బట్టిగాక ఆర్థికముగా వెనుకబడి ఉండడాన్ని ఆధారముగా సహాయము చేయాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించమని వెనుకబడిన తరగతులు, హరిజనులు, గిరిజనులకు ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య విజ్ఞప్తి చేశారు.

కేంద్రప్రతిపాదన భారతరాజ్యాంగములో యివ్వబడిన రక్షణలకు, హరిజనోద్ధరణ కార్యక్రమానికి తీవ్ర ప్రతిబంధకమని ఆయనన్నారు.

హైదరాబాద్ ప్రదేశ్ ముదిరాజ్ మహాసభవారు నేరుగా హైదరాబాద్ కార్పొరేషన్‌కు ఎన్నుకోబడిన వెనుకబడిన తరగతులు, హరిజనులు, గిరిజనులను సన్మానించడానికి ఏర్పాటుచేసిన సభలో ప్రసంగిస్తూ సాంఘిక న్యాయాలు కల్గించే టప్పుడు ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులతో బాటు సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన అంశాన్ని హద పరిగణనద తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. దురదృష్టకరమయిన యీ తరగతులవారికి కలిగిన పిల్లలు సరియైన మార్గదర్శకంలేని వాతావరణంలో ఉన్నారు. వీరి విషయాన్ని వేరుస్థాయిలో పరిశీలించాలి. కులాన్నే ప్రాతిపదికగా తీసుకోవాలి.

విద్యా విషయకంగా వెనుకబడిన తనాన్ని పూర్తిగా పరిగణనకు తీసుకోవాలనీ, తరతరాలుగా విద్యకు నోచుకోలేని వీరిపిల్లలు ఉన్నతవిద్యను పొందిన కుటుంబాలతోపోటీకి తట్టుకోలేరన్నారు.

కేంద్రప్రభుత్వ విధానం వలన ఏర్పడిన పరిస్థితిని గమనించి శాంతియుత పద్ధతులద్వారా తమ అభిప్రాయాన్ని ప్రతిభావంతంగా వెలిబుచ్చడానికి వెనుకబడిన తరగతులవారు సమైక్యతను సాధించాలన్నారు.

భగవంతుడు న్యాయం తమపక్షాన ఉండటంవలన తమప్రయత్నాలు జయప్రదం కాగలవన్నారు. కేంద్ర ప్రభుత్వం యీవిషయమై తమ వైఖరిని త్వరలో మార్చికోగలదని ఆశిస్తున్నానన్నారు.

అధ్యక్షుడు శ్రీ వి. వెంకటస్వామి, కార్యదర్శి శ్రీ కె. నారాయణరావు అంతకుముందు సభికులకు స్వాగతం చెప్పారు.

శాసనమండలి అధ్యక్షుడు శ్రీ మాడపాటి హనుమంతరావు మేయర్ శ్రీ వేదప్రకాశ్ దుసాఝ్, డా॥ లక్ష్మీనరసయ్య, (ఎం. ఎల్. ఏ) ప్రభృతులు హాజరైనారు.

(ఎ. ఎన్. ఎ)

తొలి రేడియో స్పుత్నిక్

అమెరికాచే మూడో 'అట్లాస్' ప్రయోగం

రేడియేషను పరిశీలనకు కావలసిన పరికరాలతో

కేప్ కానవరల్, ఆగస్టు 12

ప్రత్యేకమైనదానోసును అమర్చి విడుదలచేసిన "అట్లాస్" ఖండాంతర మసిల్ నేడు అనుకొన్న చోట తాకింది. ప్రపంచంలో తొలి రేడియో స్పుత్నిక్ యిదే.

ఆ నోసుబరువు టన్నున్నర. అందులో రేడియేషను పరిశీలనకు అవసరమైన పరికరాలు అమర్చబడినవి. గత 12 గంటలలోనూ అమెరికా విడుదల చేసిన యీ మిసిల్స్‌లో యిది మూడవది ఇది 500 మైళ్లదూరంవెళ్ళింది

రేడియో సాంకేతిక శబ్దాలకు ప్రయోగ రిలేస్టేషన్‌గా ఉండడానికే స్పుత్నికు ప్రయోగించబడింది.

కటాంగా రాజధానికి హామర్షెల్డు రాక

విమానాశ్రయంలో ప్రధాని షాంబే స్వాగతం: 'కాంగో రాజధానిలోని పరిస్థితిని పోల్చిచూడండి'

ఎలిజబెత్‌విల్లె, ఆగస్టు 12

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి దాగ్ హామర్షెల్డు లియోపాల్డు విల్లినుండి విమానములో నేడు కటాంగా రాజధాని ఎలిజబెత్‌విల్లె చేరుకొన్నారు. విమానాశ్రయములో రాష్ట్ర ప్రధాని షాంబే ఆయనను కలిశారు.

షాంబే స్వాగతమిస్తూ యిలా అన్నారు: "మీరాకకు చాల కాలముగా ఎదురుచూస్తున్నాను. ఇక్కడ మీరు చూసిన దానితో ఇతరచోట జరిగినదాన్ని పోల్చుకోండి" అన్నారు. అంటే కాంగో రాజధాని లియోపాల్డువిల్లిని పరోక్షంగా ప్రస్తావించారన్నమాట.

హామర్షెల్డుకుకూడ 800మందిసమితి సైనికులు వచ్చారు కటాంగాకు వచ్చిన పరిశీలన సమితి సైన్యంయిదే (ముందు షాంబే సమితి సైన్యం ప్రవేశాన్ని వ్యతిరేకించడం పాఠకులకు విదితమే)

హామర్షెల్డు షాంబేసైన్యాన్ని సమితి స్వాధీనపర్చుకునే విషయమై కటాంగా ప్రభుత్వంతో చర్చలు జరుపుతారు.

హామర్షెల్డు విమానం దిగిన పది నిమిషాలకు స్వీడిష్ సైన్యం వచ్చింది. ఆతరువాత వరుసగా మిగిలిన సమితి సైన్యమంతా దిగింది.

ప్రతిపక్ష బాలుబకత్ పార్టీ సభ్యులు కొందరు యీ సందర్భంలో "ఐక్య కాంగో వర్ధిల్లాలి" అనే నినాదం చేశారు.

బెల్జియం పౌరులు షాంబే హామర్షెల్డులు వస్తుండగా హర్షధ్వానాలు చేశారు.

ఎం.ఎస్సీ.(వ్యవసాయ) పరీక్షాఫలితాలు

హైదరాబాద్, ఆగస్టు 12

గత మే లో జరిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం ఎస్సీ. (వ్యవసాయ) పరీక్షలో క్రింది నంబర్లు గలవారు కృతార్థులైనారు.

ఎం. ఎస్సీ. (వ్యవ) ఫైనల్

1 2 3 4 5 10 12 13 14 15 16.

[ఎం ఎస్సీ వ్యవ] ఫైనల్

ప్రథమశ్రేణి మెరిట్ ప్రకారము

41 40 27 23 23 39 46 29 42 44 35 38 49 34 24 52 38 31 54 30.

ద్వితీయశ్రేణి 20 22 మరియు32 51వ నంబరు విద్యార్థి ఫలితము తరువాత ప్రకటించబడును.

త్వరలో బోనస్ కమీషన్ నియామకం

న్యూఢిల్లీ, ఆగస్టు 12

యజమానుల అభిప్రాయంతో నిమిత్తంలేకుండా త్వరలోనే బోనస్ కమీషన్ నియమించబడుతుందని కార్మికశాఖ ఉపమంత్రి శ్రీఅబిద్ అలీ నేడు లోకసభలో అన్నారు.

ఆ కమీషన్‌లో నలుగురైదుగురు సభ్యులుంటారన్నారు.

కేరళలోని పాలిబ్యాంక్ దివాలా వ్యవహారం

కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు ముఖ్యమంత్రి, హోంమంత్రి రాక

న్యూఢిల్లీ, ఆగస్టు 12

పాలిసెంట్రల్ బ్యాంక్ దివాలాతీసిన పరిస్థితులపై ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీదేశాయి నేడిక్కడ రిజర్వు బ్యాంక్ గవర్నర్ శ్రీ హెచ్. వి. ఆర్. అయ్యంగార్‌తో చర్చలుజరిపారు.

శ్రీ అయ్యంగార్ రేపు హోంమంత్రి పంత్‌ను, ఎల్లుండి ప్రధాని నెహ్రూను కలుస్తారు.

భారత ప్రభుత్వంతో చర్చలకయి కేరళ ముఖ్యమంత్రి శ్రీ పట్టంతాను పిళ్లై, కేరళ హోంమంత్రి శ్రీ పి.టి. చాకో నేడు త్రివేంద్రంలో బయలుదేరి న్యూఢిల్లీ వస్తున్నారు వారు రేపు నెహ్రూ, పంత్ ప్రభృతులతో చర్చలు జరుపుతారు

యువరాజు ప్రధాని అయితే తప్పుకొంటాం

లావోస్‌లో అధికారాల్ని చేపట్టినవారి షరతు

వియంటియాన్, ఆగస్టు 12

మాజీప్రధాని ప్రిన్స్ సోవన్నఫౌవుమా తిరిగి అధికారానికివచ్చే షరతుపై లావోస్‌లోని సైనిక పరిపాలన సమస్యా పరిష్కారానికి ప్రయత్నిస్తున్నది విప్లవకమిటీ ప్రతినిధిగా లావోస్ సైనికాధికారి జనరల్ రత్తికోసె నేడు రాజభవనానికి వెళ్ళారు ప్రిన్స్ సోవన్నను ప్రధానిగా నియమించమని తిరుగుబాటుదార్లు రాజును కోరారు.

దేశ సమైక్యతా పరిరక్షణ

దేశస్థులందరి ప్రధాన కర్తవ్యమని రాష్ట్రపతి డా॥ ప్రసాద్ ఉద్బోధ

సేలం, ఆగస్టు 12

దేశ సమైక్యతను, భద్రతను, స్వాతంత్ర్యాన్ని కాపాడడమే దేశస్థులందరి బాధ్యత; ప్రతి స్త్రీ ప్రతి పురుషుడు యీ కర్తవ్యనిష్ఠతో పనిచేయాలి అని రాష్ట్రపతి డా॥ రాజేంద్ర ప్రసాదు ఇక్కడ లక్ష మంది హాజరైన బహిరంగ సభలో ఉద్బోధించారు.

ప్రభుత్వవిధానాల్ని గురించికార్యక్రమాన్ని గురించి మీరు విమర్శించవచ్చు. విమర్శ లేకుంటే ప్రభుత్వము తప్పుదార్లు తొక్కే ప్రమాదం ఉంది, అయితే విమర్శకు విధ్వంసకార్యకలాపాలకు తేడా ఉంది అని రాష్ట్రపతి అన్నారు. దూరదేశాలలోను పొరుగు రాజ్యాలలోను కూడా ఏవో ప్రత్యేక సంఘటనలు సంభవిస్తున్నందుననే యీ నాడు దేశ సమైక్యతను పరిపోషించాలని నొక్కి వక్కాణించవలసి వస్తున్నదని కూడా రాష్ట్రపతి పేర్కొన్నారు.

మన ప్రజా స్వామ్యాన్ని ఎన్నికల ద్వారా పరిరక్షించుకుంటున్నాం. మరో రెండేళ్ళలో మళ్ళీ ఎన్నికలు జరుగుతాయి; అధికార పక్షంపట్ల ప్రజల అభిప్రాయాలు యీఎన్నికల్లో తెలుస్తాయి. ప్రభుత్వం ప్రజా వాంఛలకు లోబడి పనిచేయాలి. ఈబలాన్ని ప్రజలు నిలద్రొక్కుకోవాలి అని డా॥ ప్రసాద్ ఉద్బోధించారు.

అనేక దేశాలలో విప్లవాలు,సైనిక ప్రభుత్వాలు ఏర్పడుతుంటే మనదేశం పటిష్టమైనపరిపాలనాయంత్రాంగాన్ని కలిగిఉన్నందుకాయన హర్షం వెల్లడించారు. ఐకమత్యంలేనందుననే మనుపు దాస్యాసికి గురైనాం, యీ నాడు ప్రపంచసంఘటనలను పొరుగుదేశాల్లో విధానాలను గమనించైనా ఐక్యతను మనం గట్టిపరచుకోవాలని ఆయన అన్నారు.

గత 13 సంవత్సరాల విజయాలను రాష్ట్రపతి తన ప్రసంగంలో సమీక్షించారు.

మద్రాసు ముఖ్యమంత్రి శ్రీకామరాజ నాడార్ స్వాగతోపన్యాసమిచ్చారు.

రాష్ట్రపతి ఇక్కడి మృతవీరుల స్మారక చిహ్నాన్ని సందర్శించి పుష్పమాల సమర్పించారు.

రాష్ట్రపతి యిక్కడినుండి కాట్పాడి మీదుగా వెల్లూరుకు ప్రయాణమై వెళ్ళారు

వెల్లూరులో రాష్ట్రపతి

వెల్లూరు, ఆగస్టు 12: రాష్ట్రగవర్నర్ శ్రీ మెథీతో సహా ప్రత్యేక తైలులో యీవేళ కాట్పాడిచేరి రాష్ట్రపతి డా॥ ప్రసాద్ అక్కడినుండి కారులో వెల్లూరు చేరారు.

వెల్లూరు క్రిస్టియన్ ఆసుపత్రి - కాలేజీల స్వర్ణోత్సవాలను రాష్ట్రపతి యీవేళ ప్రారంభిస్తూ నిరంతర ఆత్మార్పణ పూర్వకమయిన సేవాకృషివల్ల మానవజాతి మనుగడ సౌఖ్యవంతము ప్రగతిశీలం కాగలదన్నారు. ఈ ఆసుపత్రి, కాలేజీల్ని స్థాపించిన డా॥ స్కడ్డర్ 90 సంవత్సరాల వయస్సున మూడు నెలలక్రితమే చనిపోయింది.

కొన్నాళ్ళక్రితం రాష్ట్రపతి భవన్ నుండి ఒక ఉద్యోగినిని గుండె ఆపరేషన్‌కు యీ ఆసుపత్రికి పంపామనీ ఆపరేషన్ విజయవంతమై ఆమె కోలుకొని తిరిగి తనవనిలో చేరిందనీకూడా రాష్ట్రపతి యీ సందర్భంగా వెల్లడించారు.

తన మద్రాసు రాష్ట్ర పర్యటనపట్ల రాష్ట్రపతి సంతోషం వ్యక్తపరిచారు.

ప్రపంచవిమాన వేగంలో కొత్త రికార్డు

గంటకు 2150 మైళ్లు వేగంతో నడిపిన వాకర్

ఎడ్వర్డు ఎయిర్ ఫోర్సు బేస్, కాలిఫోర్నియా, ఆగస్టు 12

అమెరికన్ నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ ఎడ్మినిస్ట్రేషన్ (నాసా) సంస్థ తాలూకు పైలట్ జో వాకర్ ప్రపంచంలో విమానవేగంలో సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఇంతవేగంతో విమానాన్ని ప్రపంచచరిత్రలోముందెప్పుడూ ఎవరూ నడుపలేదు కనుక ఆయన ఈనాడు విమాన "మహావేగ సాధకుడు" అయినాడు. గురువారం (ఆగస్టు 4) నాడు ఈయన శబ్దవేగానికి మూడురెట్లు వేగంతో ఎక్సు-15 రాకెట్ షిప్ (విమానం) నడిపి ఈ ఘనత సాధించాడు.

రాకెట్‌శక్తితోనడిచే ఈప్రయోగ విమానాన్ని శ్రీ వాకర్ కాలిఫోర్నియా ఎడారిలో గంటకు 2,150 మైళ్ళ వేగంతో నడిపించాడు. నరుడు నడిపేవాహనం ఏదీ ఇంతవరకు ఇంతవేగంతో పయనించలేదు. కనుక ఈయన మహావైమానికుడైనాడు.

దేశమంతటా పట్టణ పొదుపు సర్వే

ఆంధ్ర ప్రదేశ్‌లో హైదరాబాదు, మచిలీపట్టణం, పిఠాపురం, బుక్కపట్టణంలలో నిర్వహణ

హైదరాబాద్, ఆగస్టు 12

అప్లయిడు ఆర్థిక పరిశోధనా జాతీయ కౌన్సిలు ఆధ్వర్యంలో పట్టణ పొదుపుసర్వే త్వరలో హైదరాబాద్ నగరంలో నిర్వహించబడుతుంది. మొత్తం దేశంలోని 7 ప్రధాన నగరాలు 23 పట్టణాలలోని 4100 గృహాలలో ఇంటర్వ్యూ జరిపేపనిని కౌన్సిల్ యీ నెలలోనే ప్రారంభిస్తుంది.

గ్రామీణ రంగంలో పొదుపుకు సంబంధించిన రెండోసర్వే వచ్చే సంవత్సరం ప్రారంభించబడుతుంది

ఈ కౌన్సిల్ స్వతంత్రప్రతిపత్తిగల సంస్థ ఆర్థిక, సాంఘిక, పారిశ్రామికసమస్యలపై పరిశోధనజరపడమే దీనిపని

కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ డా॥ పి ఎస్. లోకనాథన్ నేడు విలేకరుల గోష్ఠిలో తమ కార్యక్రమాన్ని వివరిస్తూ మొత్తం దేశంలోని పొదుపు గురించి కౌన్సిల్ విస్తృత పరిశీలన జరుపుతుందన్నారు.

హైదరాబాదు నగరంలో 220 యిండ్లలో సర్వేజరుగుతుంది ఆంధ్రప్రదేశులో యింకా మచిలీపట్నం, పిఠాపురం, బుక్కపట్నంలో యిట్టి సర్వే జరుగుతుంది.

యుగోస్లేవియా నిపుణుడు డా॥ ఎం. మాకురా యీసర్వేకు తోడ్పడుతున్నారు. శాస్త్రీయదృక్పథంతో నగరాలు పట్టణాలు ఎన్నుకోబడినవన్నారు

కాలేజీల ప్రవేశానికి పరిమితులు

విధించడం ఉన్నత ప్రమాణాల్ని నిలపడానికి అవసరమని లోకసభలో శ్రీ మాలి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 12

దేశంలోని సంపదలు పరిమితంగా వుండుటచేతను, తగిన విద్యా ప్రమాణాలను కాపాడు దృష్ట్యాను కళాశాలల్లో చేర్చుకొనుటకు కొన్ని ఆంక్షలు పెట్ట వలసివస్తున్నదని నేడు లోకసభలో విద్యామంత్రి డా॥ కె ఎల్. శ్రీ మాలి తెలిపారు. యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్ వారి 1958-59 సంవత్సర నివేదికపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ. కళాశాలల్లో చేర్చుకొనేప్పుడు తగినఎంపిక లేనికారణంగా యూనివర్సిటీలలో చాలమంది విద్యార్థులు పరీక్షల్లో తప్పిపోతున్నారని విద్యామంత్రిగారన్నారు. ప్రతిసంవత్సరం ఇంత పెద్ద పెట్టున విద్యార్థులు తప్పిపోవడాన్ని దేశం భరించజాలదన్నారు కళాశాలకు వెళ్లజాలనివారికి ఉన్నతవిద్యార్హతలు సంపాదించుటకు సమానమైన కోర్సులు ప్రవేశ పెట్టబడునన్నారు. తగిన తయారీ జరిగిన తర్వాత విశ్వవిద్యాలయాలలో ప్రాంతీయ భాషలనే బోధనాభాషగా పెట్టాలని కేంద్ర ప్రభుత్వం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ కోరుచున్నదని ఆయన పునరుద్ఘాటించారు. తొందరపడి ప్రాంతీయభాషలో బోధన ప్రారంభించిన విద్యా ప్రమాణాలు పడిపోవునన్నారు. ఉన్నత ప్రమాణాలు గల పుస్తకాలను హిందీలోకి అనువదించే ఒకపథకాన్ని తాను ఈమధ్యనే సిద్ధపరచానని, మూడు వందల పుస్తకాలను అనువదించడంతో పని ప్రారంభింపబడినవన్నారు. అనువాద కార్యక్రమాన్ని చేపట్టిన విశ్వ విద్యాలయాలకు కేంద్ర సహాయం నూటికి నూరు పాళ్ళు లభించగలదన్నారు ప్రాంతీయ భాషల్లోకి అనువదించే యూనివర్సిటి కూడ ఆదేవిధంగా కేంద్ర సహాయం లభించునా అని కొందరు వేసిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, కేంద్రప్రభుత్వంపైనే మొత్తం భారం మోపడం సమంజసంకాదనీ, హిందీపట్ల కేంద్రం ప్రత్యేకశ్రద్ధ తీసికొనవలసి వస్తున్నదని డా॥ శ్రీమాలి అన్నారు. ప్రాంతీయ భాషలపట్ల కేంద్రానికి ఆసక్తి పున్నా అనువాదపుస్తకాలను ఆయా రాష్ట్రాలు, కేంద్రం సమకూర్చుటలో భరించవలసివుండునన్నారు.

నేడు పునః ప్రారంభమైన చర్చకు తొలుత శ్రీయుతులు అటల్ బిహారీ వాజ్పాయి (జనసంఘం), ప్రకాశ్ వీర్ శాస్త్రి (స్వతంత్ర) బ్రజ్ రాజ్‌సింగ్ (సోషలిస్టు) మాట్లాడుతూ యూనివర్సిటీలలో విద్యార్థులను చేర్చుకొనుటలో ఆంక్షలు విధించుట హానికరమన్నారు యోగ్యతలాధారంగా యూనివర్సిటీలకు ప్రవేశాలిచ్చిన యెడల నిమ్నజాతుల వారికి అన్యాయం జరుగునని శ్రీ బి. కే. గాయక్‌వాడ్ (రిపబ్లికన్) అన్నారు డా॥ పి. కృష్ణస్వామి (స్వతంత్ర) మాట్లాడుతూ సమాజంలోని హతభాగ్యులకు న్యాయం చేకూర్చుటకు యోగ్యత పద్ధతిలో కొంత మార్పు జరుగాలన్నారు.

పోలీసు కాల్పులకు ఒకని మరణం

ఫిరోజాబాదులో సంఘటన

ఆగ్రా, ఆగస్టు 12

ఇక్కడికి 35 మైళ్ళ దూరంలోగల ఫిరోజాబాద్ పట్టణంలో ఒక ఊరేగింపుపై రాళ్లురువ్విన ఉద్రిక్త జన సమూహముపై పోలీసులు కాల్పులు జరపగా ఒకరు చనిపోయినట్లు, ఐదుగురు గాయపడినట్లు ఇక్కడికి వార్తలు చేరినవి.

జిల్లా అధికారులు పట్టణంలో 144 సెక్షన్‌ను విధించారు

భారత పర్యటన జయప్రదమైనది

ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు ఐలిఫ్ వివరణ

రావల్పిండి, ఆగస్టు 12

తన భారత పర్యటన జయప్రదమైనదని ఢిల్లీలో ప్రధాని నెహ్రూతో చర్చలు జరిపి ఇండో - పాక్ కాలవ నీటి వివాదంపై పాకిస్తాన్ ప్రభుత్వముతో చర్చలు జరపడానికి నేడు విమానంలో యిక్కడికి వచ్చిన ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు ఐలిఫ్ అన్నారు.

భారత పర్యటన జయప్రదమైనది

ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు ఐలిఫ్ వివరణ

రావల్పిండి, ఆగస్టు 12

తన భారత పర్యటన జయప్రదమైనదని ఢిల్లీలో ప్రధాని నెహ్రూతో చర్చలు జరిపి ఇండో – పాక్ కాలవ నీటి వివాదంపై పాకిస్తాన్ ప్రభుత్వముతో చర్చలు జరపడానికి నేడు విమానంలో యిక్కడికి వచ్చిన ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు ఐలిఫ్ అన్నారు.

స్వాతంత్ర్య దిన సంచిక

"గోలకొండ పత్రిక" స్వాతంత్ర్య దిన సంచిక ఆదివారపు వ్యాసాలతో సహా 15 వ తేదీకి 14 పుటలతో వెలువడుతుంది. ఈ ప్రత్యేకసంచిక వెల 13 నయాపైసలు.

మేనేజర్

ఎన్నికల సమయంలో పత్రికలు, అపద్ధర్మ ప్రభుత్వాల పాత్ర

విచారణకు సిలోన్‌లో కమిషన్ ఏర్పాటు

కొలంబో, ఆగస్టు 12

సింహళంలో యీ యేడాది మార్చి, జులై నెలల్లో జరిగిన ఎన్నికల సందర్భంగా పత్రికలు నిర్వహించిన పాత్రను గురించి, యీ ఎన్నికల సమయంలో అపద్ధర్మ ప్రభుత్వము ఉద్యోగులు తమ అధికారాన్ని దుర్వినియోగ పరుచుకున్నట్లయితే ఆ విషయాన్ని గురించి విచారించేందుకు తన ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేస్తుందని యీ వేళ సిలోన్ గవర్నర్ జనరల్ గుణతిలకే పార్లమెంటులో ప్రకటించాడు.

సిలోన్‌లోని జాతీయ పత్రికలను ప్రభుత్వం గైకొనే విషయమై బిల్లు ప్రవేశపెట్టబడుతుందనికూడా ఆయన అన్నాడు. ఇంత మాత్రాన వార్తా పత్రికల ప్రజాస్వామ్య శీలానికి దెబ్బ తగలదుగానీ గుత్తాధికారం తొలగింపబడుతుందని ఆయన హామీ ఇచ్చాడు.

మాజీ ప్రధాని బండారు నాయకే హత్యవెనుకగల రాజకీయ కారణాల విచారణకుకూడా కమిషన్ ఏర్పాటవుతుందన్నాడు.

ఈ వేళ పార్లమెంట్ సిలోన్ పార్లమెంటు ప్రథమ సమావేశంలో ప్రసంగిస్తూ గవర్నర్ జనరల్ గుణతిలకే సహజీవన సిద్ధాంతాన్ని, తటస్థ విధానాన్ని తన ప్రభుత్వం అనుసరిస్తూ కామన్వెల్తు దేశాలు తదితర విదేశాలతో స్నేహ సంబంధాలను నెలకొల్పుకుంటుందని అన్నాడు. సిలోన్ భారతీయుల సమస్యను సంతృప్తికరంగా పరిష్కరించడానికి తన ప్రధాన మంత్రిణి ప్రయత్నిస్తుందనీ సిలోన్ రిపబ్లిక్‌గా అవతరించడానికి రాజ్యాంగం సవరించబడుతుందనీ కూడా గుణతిలకే ప్రకటించాడు.

5 వేల తక్షణ విరాళాలకు దారితీసిన పేదటీచర్ భూరివిరాళం

కర్నూలు, ఆగస్టు 12

"గిద్దలూరు తాలూకాలోని ఆకవీడు గ్రామంలో పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ పి. నారాయణరెడ్డి అచ్చంపేట, ఆకవీడు, అరవీటకోట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల నందరిని సమావేశపరిచి ఆకవీడులో మాధ్యమిక పాఠశాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా పరిషత్తుకు కొంత విరాళమివ్వాలని అధ్యక్షులు కోరగానే పీర ఉపాధ్యాయుడు శ్రీ జోసఫ్ వెంటనే తన రెండు మాసాల వేతనాన్ని (అనగా రు. 100లను) ఉదారంగా యిచ్చారు. గ్రామ రైతులకంటె ప్రథమంగా ఒక సామాన్య పేద ఉపాధ్యాయుని ఉదార స్వభావాన్ని చూచి వెంటనే మిగతా వారంతా విరాళాల రూపకంగా రు. 5 వేలను యిచ్చారు. (స్వ-వి)

మీ కొద్దిపాటి ఆశ్రద్ధ భయంకర ఫలితము.

మీరు యేమైనతెలియనటువంటి పాతరోగములలో తగులు కొన్న యెడల వెంటనే బొంబాయి క్లినిక్‌కువచ్చి ఆరోగ్య లాభము పొందగలరు. లేనియెడల రోగము పాతదై భయంకర ఫలితము కలుగును ప్రతిరోగము యొక్క చికిత్స బాధ్యత మరియు గ్యారంటీగా చేయబడును. గోటు:- మీ లింగము యొక్క బలహీనతను విజిలీమిషను ద్వారా చేయబడును. దానినుండి చాల తొందరగా బలము చేకూరగలదు.

టైము:- ఉదయము 9 గంటల నుండి రాత్రి 8 గంటలవరకు ప్రతి ఆదివారము దవాఖాన తెరువబడియుండును.

అడ్రసు:- బొంబాయి క్లినిక్ పాత జైలు, సికింద్రాబాదు మార్కెటు దగ్గర.

రు. 5/- లకు రేడియో

ఈ రేడియో విద్యుత్ మరియు బ్యాటరీ లేకుండా శ్రావ్యమైన సంగీతము వెల్వరు. మా నూతన స్కీము ప్రచారమార్థై యిది ప్రవేశపెట్టబడునున్నది. పూర్తి వృత్తి జీవితంగును. లేనియెడల డబ్బు వాపసు నిరాశ నెందక వెంటనే ఆర్డర్లు పంపండి.

American Radio House,
Goal Bagh/ R- 10/ Amritsar.

శార్వరి సం॥ శ్రావణ బ॥ సప్తమి
తా 10-28 అశ్విని ఉ 6-37
సా వ 4-53 మొ॥ 6-36 వరకు
(శాలివాహన శకము: 22-5-1882)
1960 ఆగస్టు 18 శనివారము

"కులము శీలంబు హితవాక్యములును నేర్పు
గార్యవాదిత్వ సద్వచో
గౌరవంబుం దలఁపు
గల్గుట దక్షత యలఘు
గుణములండ్రు దూతకు
ని య్యెడు నార్యజనులు."

- భారతము (శాంతి)

గోలకొండపత్రిక
ఫోన్. నెం. 3280
1960 ఆగస్టు 13
శనివారము

అల్పసంఖ్యాక భాషాపర్గాలు

మన దేశమునందలి వివిధ రాష్ట్రాలలో భాషరీత్యా అల్పసంఖ్యాక వర్గాలు నివసించుచున్నవి. దేశము భాషాప్రయుక్తముగా విభజింపబడినప్పటికిని ప్రతి రాష్ట్రమునందును అల్పసంఖ్యాక వర్గాల అస్తిత్వము అనివార్యమైనది. బహుభాషలు మాట్లాడు ప్రజలు గల మన దేశములో యే యొక రాష్ట్రమునుగూడ నూటికి నూరు పాళ్ళు యేక భాషా రాష్ట్రముగా యేర్పాటు చేయుట సాధ్యము కాజాలదు. నిజానికి యిటువంటి యేర్పాటు కొరకు ప్రయత్నించుట అభిలషణీయముకూడ కాజాలదు. భాషలు భిన్నమైనప్పటికిని భారతీయ సంస్కృతిలో యేకత్వము అడుగడుగున స్పష్టముగా కనుపించుచున్నది. ఈ యేకత్వమే భారత జాతీయతకు ప్రధాన ప్రాతిపదిక. ఈ యేకత్వమును పోషించి, ప్రతి రాష్ట్రములోని అల్పసంఖ్యాక భాషావర్గాలకు కావలసిన విద్యా సౌకర్యాలు మొదలైన సదుపాయాలను కల్పించుట కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ప్రధాన కర్తవ్యమైయున్నది.

భాషారాష్ట్రాల యేర్పాటు ప్రజల సౌకర్యము కొరకు ఉద్దేశింపబడినది. వయోజన వోటింగుమీద ఆధారపడిన ప్రజాస్వామిక వ్యవస్థలో వోటర్ల మాతృభాషలో పరిపాలన జరుగవలసియుండును. అందుచేత ప్రతి రాష్ట్రములోని అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు మాట్లాడు భాషలో పరిపాలన జరుగుట అనివార్యమని చెప్పక తప్పదు. కాని దీనితోపాటు అల్పసంఖ్యాకులైన భాషావర్గాలకు కావలసిన సదుపాయాలను కల్పించుటలో సంపూర్ణముగా సహకరించవలసిన బాధ్యత అధికసంఖ్యాకులైన ప్రజలమీద కలదని నిస్సందేహముగా చెప్పవచ్చును. మన దేశములోని వివిధ రాష్ట్రాలలో నివసించు పౌరులు యీ బాధ్యతను గుర్తించి, తదనుగుణముగా వ్యవహరించవలసియుండును. సమీపమారు నాలుగు సంవత్సరాల క్రిందట మన దేశములో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగినది. తత్ఫలితముగా యించుమించుగా దేశమంతటను భాషా ప్రయుక్త రాష్ట్రాలు యేర్పాటు చేయబడినవి. ఈమధ్యనే మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల యేర్పాటు గూడ జరిగినది. భాషా రాష్ట్రాల యేర్పాటునుగూర్చి సూచనలు గావించుటకు కేంద్ర ప్రభుత్వము నియమించిన సంఘము తన నివేదికలో అల్పసంఖ్యాక వర్గాల కొరకు చేయవలసిన సౌకర్యాలను చక్కగా వివరించియున్నది. ఈ విషయమై పర్యవేక్షణ గావించి, అప్పుడప్పుడు పరిస్థితిని సమీక్షించి నివేదికను సమర్పించుట కొరకు యీ సంఘము ప్రత్యేకముగా అల్పసంఖ్యాక భాషా వర్గాల కమిషనర్ నియామకమును సిఫారస్ చేసియుండెను. తత్ఫలితముగా భారత ప్రభుత్వము యిందు కొరకొక కమిషనర్‌ను నియమించినది. ఈ కమిషనర్ గడచిన నాలుగు సంవత్సరాలలో వివిధ రాష్ట్రాల యందు అల్పసంఖ్యాక భాషా వర్గాల పరిస్థితినిగూర్చి విచారణ జేసి ఒక నివేదికను సమర్పించినారు. ఈ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టుట జరిగినది. ఇందులోని వివరాలు పత్రికలలో ప్రకటితమైనవి.

ఈ నివేదికలో వివిధ రాష్ట్రాలలో నివసించుచున్న అల్పసంఖ్యాక భాషావర్గాల పరిస్థితిని సమీక్షించుట జరిగినది. ఈ సందర్భమున వివిధ రాష్ట్రాలలోని అల్పసంఖ్యాక వర్గాల కష్టసుఖాలను బాగుగా విచారించి, వారి కోరికలను తెలుసుకొనుట జరిగినది. ఈ కోరికలనుగూర్చి యీ నివేదికలో వివరించుట జరిగినది. ఈ నివేదికలో అల్పసంఖ్యాక భాషావర్గాల కమిషనర్‌గారు వివిధ రాష్ట్రాలలో వ్యాపించియున్న పరిస్థితిపట్ల సంతృప్తిని వెల్లడి చేసియున్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రాంతములో నివసించుచున్న అల్పసంఖ్యాకులపట్ల ఉదారముగా వ్యవహరించుచున్నట్లు తెలియజేసినారు. ఇది మిక్కిలి సంతోషకరమైన విషయము. ఈ విషయమై వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించుచున్న విధానము సర్వవిధాల హర్షించదగియున్నది. ఇకముందుగూడ రాష్ట్రప్రభుత్వాలు యీ విషయమై యిప్పటివలెనే సానుభూతితో వ్యవహరించగలవని విశ్వసించుచున్నాము. దేశ సమైక్యతను దృష్టిలోనుంచుకొని భారత జాతీయతకు అనుగుణముగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రాంతమున నివసించు అల్పసంఖ్యాకుల హక్కులను కాపాడుటలో శ్రద్ధతో, సానుభూతితో, న్యాయముగా వ్యవహరించవలసియుండును.

ఈ ప్రాంతాలలో నివసించుచున్న భాషావర్గాలుకూడ తమ కర్తవ్య నిర్వహణలో యేవిధమైన లోపము కలుగని రీతిగా వ్యవహరించవలసి యుండును. చీటికిమాటికి యేవో ఆందోళనలు లేవదీయు మనస్తత్వము సరియైనది కాదు. వాస్తవిక దృక్పథముతో న్యాయమైన హక్కులను శాంతియుతముగా సాధించుకొనుట శ్రేయస్కరము. తమ నివేదికలో యీ విషయమై ప్రస్తావించుచు విద్యావ్యవస్థలో అన్ని దశలయందు అల్పసంఖ్యాకుల భాషకు ప్రత్యేక స్థానముఉండవలెననియు, ప్రాంతీయ భాషా బోధన తమ పిల్లలకు నిర్బంధము చేయగూడదనియు, యీ అల్పసంఖ్యాకులు కొన్ని సందర్భాలలో చేయుచున్న ఉద్ఘాటన సరియైనది కాదని యు కమిషనర్ హెచ్చరించియున్నారు. ఈ హెచ్చరిక గమనించదగియున్నది. ప్రతి రాష్ట్రములోను, అన్ని దశలయందును అల్పసంఖ్యాకులు మాట్లాడు భాషలకు ప్రత్యేక స్థానము నిచ్చుటగాని లేదా వారికి ప్రాంతీయ భాషలను నిర్బంధ పఠనీయములు గావించుటగాని ఆచరణసాధ్యమైన ప్రతిపాదనలు కాజాలవు. ఈ అల్పసంఖ్యాకులు యిటువంటి మనస్తత్వమును వదలిపెట్టుకొనవలెనని భాషావర్గాల కమిషనర్ గారు చెప్పిన హితవు సమంజసమైనది. ప్రాంతీయ భాషలను విధిగా నేర్చుకొను నియమమునుగూర్చి అల్పసంఖ్యాకులు ఆక్షేపణ చేయుట సరియైన పద్ధతి కాదు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘము చేసిన సూచనల ప్రకారము తమకు కావలసిన సదుపాయాలు చేయబడినప్పుడు అల్పసంఖ్యాక భాషా వర్గాలు సంతృప్తి చెంది, తమ ప్రాంతీయ భాషలను నేర్చుకొని దేశ శ్రేయస్సుకు అనుగుణముగా వ్యవహరించవలసియుండునని కమిషనర్ గారు చేసిన సూచన సర్వత్ర పాటింపబడగలదని ఆశించుచున్నాము.

మళ్లీ చైనాచే సరిహద్దుల ఆక్రమణ

తీవ్రనిరసన: దూషణీయ చర్యఅని లోకసభలో ప్రధాని శ్రీనెహ్రూ

న్యూఢిల్లీ, ఆగస్టు 12

కామెంగు సరిహద్దు డివిజన్ ప్రాంతంలో చైనా గస్తీదళం జూన్ 8 న భారత భూభాగంలోనికి చొచ్చుకువచ్చిన సంఘటనపై భారతప్రభుత్వం తీవ్ర ఆక్షేపణ తెలిపిందనీ ఆ చర్య తీవ్ర దూషణీయ చర్య అని నేడు లోకసభలో నెహ్రూ అన్నారు.

గస్తీదళాల్ని పంపే విషయంలో ఒప్పందాన్ని చైనా అధికారులు యీ చర్యద్వారా ఉల్లంఘించారనినెహ్రూ చెప్పారు. అయితే గత మేనెల నుండి మాత్రం చైనా దళాలతో సరిహద్దు పోరాటాలు మాత్రం జరుగలేదని అనుబంధ ప్రశ్నకాయన జవాబిచ్చారు.

జూన్ 8 న 25 మంది గల చైనా గస్తీదళం కామెంగ్ ప్రాంతంలో భారత భూభాగంలోనికి చొచ్చుకొనివచ్చి 4న్నర మైళ్లలోపల గల టాక్‌సాంగ్ బౌద్ధాలయం వరకు వచ్చాయనీ స్థానికులు వారిని మందలించగా వెళ్ళిపోయారనీ డిప్యూటీ మంత్రిణి శ్రీమతి లక్ష్మీమీనన్ వివరాలు తెలిపారు.

ఎవరో కొందరు గొంగలవలె రహస్యంగా ప్రవేశించి పది నిమిషాల్లో పరారై పోకుంటే వారిని ఏమిచేయాలో అర్థం కావడంలేదు, వారిని వెన్నాడాలా, వెన్నాడి ఏమి చేయాలి అని మరికొన్ని ప్రశ్నలకు శ్రీనెహ్రూ జవాబిచ్చారు.

మన గస్తీదళాలూ సరిహద్దులో ఉన్నాయి. అయితే అవి ఒక్కచోటే నిలువక తిరుగుతూ ఉంటాయి;అలాగే చైనా గస్తీదళాలుకూడా. అయితే యీ తిరుగుటలో కొందరెవరైనా గస్తీదళాలకు తెలియకుండా సరిహద్దులు దాటే వీలుంది అని నెహ్రూ మరో ప్రశ్నకు జవాబిచ్చారు. ఇది దూషణీయమైన చర్య అన్నారు.

లడక్ ప్రాంతములో చైనాసేనలు బలపరచబడ్డాయన్న వార్తను ప్రధాని ఖండించారు మనకు మనము తయారు చేసుకున్న ఆయుధాలతో పాటు విదేశీ ఆయుధాలున్న స్టీల్ చైనాకు రష్యా ఆయుధాలుండి ఉండవచ్చునన్నారు కూడా.

పంజాబ్ - పశ్చిమపాక్ సరిహద్దు

పంజాబ్ - పశ్చిమ పాకిస్తాన్ సరిహద్దు తగాదాలన్నీ పరిష్కారమయ్యాయనీ సరిహద్దులు స్పష్టపరుపబడ్డాయనీ యీసరిహద్దులను మార్చు చేయడముద్వారా 10.9 చదరపు మైళ్ళ భాగము పాకిస్తాన్‌కుపోగా 8.24 చదరపు మైళ్ళ భాగం ఇండియాకు వస్తుందనీ లోకసభలో మరో ప్రశ్నకు డిప్యూటీ మంత్రిణి శ్రీమతి లక్ష్మీ మీనన్ తెలిపారు.

టిబెట్‌లోని భారత వ్యాపారస్తులు

టిబెట్‌లోని 358 మంది భారతీయ వ్యాపారస్తులు వివిధ రూట్ల ద్వారా సిక్కిం, యు.పి, హిమాచల ప్రదేశ్, పంజాబ్-జమ్మూ కాశ్మీర్‌లకు పయనమై వచ్చారనీ ఇది యీ యేడాది జూన్-జులై నెలల్లో జరిగిందనీ లిఖిత పూర్వక సమాధానంలో శ్రీ నెహ్రూ తెలిపారు.

నాథులా కనుమద్వారా ఎగుమతి దిగుమతులు తగ్గిపోయినట్లు కూడా ఆయన చెప్పారు.

ప్రభుత్వానికి కర్నూలు జిల్లానుండి 35 లక్షల ఋణ సేకరణ

కర్నూలు, ఆగస్టు 12

"కర్నూలు జిల్లా ప్రజలు నుండి దాదాపు రు.35లక్షల ధనమును ఋణముగా ప్రభుత్వానికి సహాయం చేసేందుకు తెటాయించినారు. ఈ సందర్భములో జిల్లాకలెక్టరు శ్రీ జి. నారాయణ ఇట్టి జిల్లాలోని అన్ని తాలూకా తహశీలుదారులను, పంచాయతీసమితి అధికారులను సమావేశ పరచారు నంద్యాలడివిజన్‌కు రు 8లక్షలు తెటాయించినారు.

అధిక ఆహారోత్పత్తికి; వ్యవసాయాభివృద్ధికి; రైతులకు ఋణాలు; ప్రాజెక్టులు; ప్రభుత్వ ప్రణాళికల విజయానికి ఆంధ్రప్రభుత్వము రు.9కోట్లు ఋణాన్ని సేకరించాలి. అందులో కర్నూలుజిల్లా రు 35 లక్షలు వసూలు చేయాలి. (స్వ.వి)

గద్వాల సప్లయి పథకం

ఈనెలాఖరు 40 వేలు మంజూరి

మహబూబ్‌నగర్, ఆగస్టు 12

మైనర్ ఇరిగేషన్ క్రింద, చెరువుల మరమ్మతు కార్యక్రమాలక్రింద మహబూబ్‌నగరం జిల్లా కు రివెన్యూ బోర్డు రు.61కి 85వేలు మంజూరు చేసింది, మొత్తం తెలంగాణాకు యీ కేటాయింపు రు. 4+2000, ఆంధ్రకు రు. 1600000 ఉంది.

అంటే మొత్తం కెటాయింపు రు. 2042000 ఉందన్నమాట.

... ...

మహబూబ్‌నగర్ జిల్లా పథకం ప్రకారం గద్వాలకు జాతీయగ్రామీణ నీటిసప్లయి పారిశుద్ధ్య పథకాల క్రింద 40 వేలు ఖర్చుచేయడానికి తలపెట్టబడింది.

... ...

కొత్తకోటలో ప్రసూతి ఉపకేంద్రానికి శ్రీపద్మనాభరెడ్డి (ఎం. ఎల్. ఏ) ప్రారంభోత్సవం జరిపారు. జిల్లా ఆరోగ్యశాఖాధికారి డా॥ ఎస్. వి. నాగభూషణం అధ్యక్షత వహించారు.

హిందూస్తాన్ విమాన ఫ్యాక్టరీలో రైలుపెట్టెల ఉత్పత్తి

అనుకున్నదానికంటే ఒక సంవత్సరం ముందుగానే లక్ష్య సాధన

బెంగుళూరు, ఆగస్టు 12

బెంగుళూరులోని హిందూస్తాన్ విమాన ఫ్యాక్టరీ "అంతా ఉక్కు, తక్కువ బరువు" గల యింటెగ్రల్ రకం బ్రాడ్‌గేజి రైలుపెట్టెలుఉత్పత్తి చేయడంలో శీఘ్ర పురోగతి సాధిస్తోందని తెలుస్తోంది. ఉత్పత్తిస్థాయి నెలకు 22 రైలు పెట్టెలకు పెరిగింది. నెలకు 25 రైలుపెట్టెలదొప్పున గరిష్ఠఉత్పత్తి దశల వారీగా 1961 అక్టోబరు - నవంబరు నాటికి అందుకోవాలని నిర్దేశించబడింది. అయితే, యీలక్ష్యం ఒక సంవత్సరంముందుగానే సాధించబడుతుందని భావించబడుతోంది. ఇంటెగ్రల్ కోచుల ఉత్పత్తి క్రమంగా అభివృద్ధి చెందడంతో, యీ ఫ్యాక్టరీలో పాత రకం రైలుపెట్టెల ఉత్పత్తి క్రమంగా తగ్గించబడుతోంది. ఈ రకంలో అధిక రైలు పెట్టె ఒక నెల్లాళ్లలో అంటే 1960 సెప్టెంబరులో బయటకవస్తుంది.

విమానాల ఉత్పత్తి మారిగానే అంతా ఉక్కు, తక్కువ బరువుగల రైలు పెట్టెలు ఉత్పత్తి చేసేందుకు 1948 లో యీ ఫ్యాక్టరీలో ఒక నమూనా రూపొందించబడింది. ఇవి ఎక్కువ ప్రజాదరణ పొందాయి. రైల్వే బోర్డుతో సంప్రదించి యీ ఫ్యాక్టరీ యిలాంటి రైలు పెట్టెలు తయారు చేయడానికి 1956 అక్టోబరులో పశ్చిమ జర్మనీలో ఎమ్. ఎ ఎస్. అనే ఒక ప్రముఖ రైలు పెట్టెల ఉత్పత్తి సంస్థతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది.

ప్రదేశ్ రాజకీయాలు:

ప్రస్తుత విభేదాలకు కేవలం అపార్థాలే మూలకారణం

తానొక వర్గం వ్యక్తిగాగాని, ఒకరి కంట్రోలులోగాని వ్యవహరించడంలేదని ముఖ్యమంత్రి ప్రకటన

ఐక్యతా కృషికై ప్రయత్నం

హైద్రాబాద్, ఆగస్టు 12

ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల కమిటీ ఎన్నికల వ్యవహారంలో అభిప్రాయ భేదాలకు మూలకారణం పరస్పరం అపార్థాలు చేసుకోడమేనని కాంగ్రెసు శాసనసభాపార్టీ నాయకుడు గనుక తాను ఏ వర్గంతోనూ సంబంధించిలేననీ సామరస్య పూర్వకంగా సమస్యను పరిష్కరించాలనే తాను ఆశిస్తున్నాననీ యీ వేళముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య విలేఖరుల గోష్ఠిలో ప్రకటించారు.

సామరస్య సాధనకు తాను కృషి చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి శ్రీ కె.వి. రంగారెడ్డి కావించిన ప్రకటనను ప్రస్తావించి తాను అట్టి కృషిని ఆహ్వానిస్తానని శ్రీ సంజీవయ్య అన్నారు.

ఏ సంస్థలోనైన ఎన్నికలు జరిగినప్పుడు పదవులను ఆశించేవారు కొందరు ఉంటారు, అయితే ఆ సమస్యను పార్టీ ఐక్యత దెబ్బతినకుండేట్లు పరిష్కరించుకోవాలి. రెండు వర్గాలంటూ ఏర్పడినాయంటే అది శాస్త్రీయమేనని కొన్నాళ్ళు జరిగితే మళ్ళీ అందరూ ఏకమౌతారనీ శ్రీ సంజీవయ్య పేర్కొన్నారు.

ఎన్నికల కమిటీలో మెజార్టీస్థానాలను సంపాదించాలని ప్రయత్నిస్తున్న ఒక వర్గాన్ని కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి బలపరుస్తున్నారన్న వాదనను ముఖ్యమంత్రి నేడు నిరాకరించారు. ఈ సమస్య ఏదో రాజీ బేరానికై కాంగ్రెసు అధ్యక్షుని వద్దకు రాయబారంవెళ్ళి ఆలోచన ఉన్నదన్న అభిప్రాయాన్ని కూడా ఆయన కాదన్నారు.

పార్టీ నాయకుడుగా ముఖ్యమంత్రిగా తాను స్వతంత్రంగానే వ్యవహరిస్తున్నాననీ కాని తన సహమంత్రులలో— పి. డబ్ల్యు. డి. మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుతో కూడా- సంప్రదించవచ్చుననీ అంత మాత్రాన తాను ఒకరి అధీనంలోఉండి పనిచేస్తున్నాననుకోరాదనీ ముఖ్యమంత్రి స్పష్టపరిచారు.

కాంగ్రెసు కార్యవర్గం పనుపున మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ నాడార్ 22వ తేదీన హైద్రాబాద్ రానున్నారనీ శ్రీ ధేబర్ రాక విషయం ఇంకా తేలలేదనీ కూడా ముఖ్యమంత్రి వెల్లడించారు. రాజీ ప్రయత్నంఉంటే ఆది శ్రీ నాడార్ వచ్చేముందే కుదిరిపోతే బాగుంటుందని శ్రీ సంజీవయ్య అన్నారు. అపార్థాలవల్ల అభిప్రాయభేదాలకు గురై విడిపోయిన వారంతా తన స్నేహితులే కాబట్టి తాను కూడా రెండు వర్గాల సమైక్యతను ప్రయత్నించవచ్చునని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఇచ్చిపుచ్చుకొనే తత్వము చూపలిగాని తమ పదవులకు అంటిపెట్టుకొని ఉండి ఒక్క అంగుళమైనా కదలనని పట్టుపట్టడము బాగుండదని శ్రీ సంజీవయ్య ప్రస్తావించారు.

ఈ అభిప్రాయ భేదాలవల్ల పరిపాలన స్తంభించి పోయిందన్న ఆరోపణను ముఖ్యమంత్రి ఖండించారు,అన్నిపైళ్ళు యథాప్రకారము సాగుతూనే ఉన్నాయని ఆయన అన్నారు

గ్రామాల్లో హరిజనులు

గ్రామాల్లో హరిజనుల పరిస్థితు లేమీ బాగుపడలేదనీ అయినా ప్రభుత్వంవారికి భూములు, గృహనిర్మాణ స్థలాలు ఇచ్చి తోడ్పడుతున్నదనీ నేడు గోష్ఠిలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందు బాటులో ఉన్న భూములు వెంటనే భూముల్లేని హరిజనులకు పంచబడాలని జిల్లాఅధికారులకు ఆదేశాలివ్వబడ్డాయనీ ఇందుకై ప్రత్యేక సిబ్బంది కావాలన్న కలెక్టర్ల సూచనను ప్రభుత్వము పరిశీలిస్తున్నదనీ ఆయన చెప్పారు.

హరిజనుడు ముఖ్యమంత్రి అయినందున ఏదో తమకు ఎంతో లాభము జరుగుతుందని హరిజనులు భావించారనీ అయితే ఎన్నో కష్టాలుంటాయనికూడా ఆయన అన్నారు. హరిజనుల పరిస్థితి అభివృద్ధి చెందడానికి ఇంకా కొంత కాలము పడుతుందన్నారు.

మంత్రివర్గ సమావేశం

ఢిల్లీలో మూడో ప్రణాళిక విషయమై చర్చలకు వెళ్ళిన రాష్ట్ర ఉన్నత కార్యదర్శి, ప్లానింగ్ కార్యదర్శులు తిరిగి వచ్చి సమర్పించే నివేదికను పరిశీలించేందుకు మంత్రివర్గము ఆగస్టు 16న సమావేశమౌతుంది.అనంతర చర్చలపై ముఖ్యమంత్రి ఆర్థిక మంత్రి యీ మాసాంతానికి ఢిల్లీ వెళ్తారని తెలుస్తున్నది.

గ్రామీణ నిరుద్యోగ నివారణ పథకం

షాద్‌నగర్ పంచాయత్ సమితి అధ్యక్షుని వెల్లడి

మహబూబ్‌నగర్, ఆగస్టు 12

అన్నిపంచాయత్ కమిటీలతో సంప్రదించిన మీదట పంచాయత్ బ్లాకులో గ్రామీణ నిరుద్యోగ నివారణకు ఒక ముసాయిదా పథకం తయారుచేయబడినదని. సమితి సభ్యులనుద్దేశించి షాద్‌నగర్ పంచాయత్ సమితి అధ్యక్షుడు శ్రీ బి. రాందేవ రెడ్డి అన్నారు. ఈ ముసాయిదాను తయారు చేయుటలో ప్రధానోద్దేశం ఉద్యోగావకాశాలను కనుగొనుటే నన్నారు గ్రామీణ ఆర్థిక పరిస్థితిని సాధ్యమైనంత పరచుటకు పారిశ్రామికరంగాలను గ్రామ ప్రాంతాలకు మార్చుట, శాస్త్రీయ పద్ధతిన అధిక పంటలు పండించుటకు గ్రామీణుల్లో వుండే "మానవ శక్తి"ని వినియోగించుట, గ్రామాలలో కొన్ని నిశ్చిత కార్యక్రమాలను నిర్వహించుటద్వారా గ్రామ ప్రాంతాలలో ఉద్యోగావకాశం లభించగలదన్నారు.

ఈనిరుద్యోగ సమస్యను సంతృప్తికరంగా పరిష్కరించుటకు కొన్ని తలపెట్టిన కార్యక్రమాల పట్టికను శ్రీ రాందేవ రెడ్డి చదివి సభ్యులకువినిపించారు. అసలే పనిలేని వారికి కొద్దిమాత్రమే పనిగల వారికి అప్పుడప్పుడు పనిలేకుండా వుండేవారికి తగు భృతి లభించుటకు వీలుగా కార్యక్రమాలనునిర్వహించుటకు ప్రతి పంచాయత్ కమిటీకి ఒక ప్రణాళిక వుండగలదన్నారు.

ఈబ్లాక్ ప్రణాళికకు జిల్లాకలెక్టర్ శ్రీ డి. శంకరగురుస్వామి కొన్ని సలహాలను యిచ్చారు. ప్రతి ఒక కుటుంబానికి ఒక ప్రణాళికను సిద్ధంచేసి ఆవిధంగా నిర్వహించుటకువీలుగా ఆదర్శ గ్రామంగా సభ్యులందరు ఏకగ్రీవంగా కోడిచెర్లను ఎన్నుకున్నారు, మొదట రంగారెడ్డిగూడెంలో ప్రతి కుటుంబానికి ఒక ప్రణాళిక యివ్వబడుటేగాక వివిధ పథకాలకుగాను రు 80 వేలు ఇవ్వబడినవి. అయినా ప్రజలు తగినంత చొరవ, ఉత్సాహం చూపలేదని సమితి ఉపాధ్యక్షుడు శ్రీ వెంకట ప్రతాపరెడ్డి తెలిపారు."ప్రతి కుటుంబానికి ఒక ప్రణాళిక" పథకానికి ఒక గ్రామాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ సభ్యులకు కలదని శ్రీరాందేవ రెడ్డితెలిపారు. వ్యావసాయికంగా ప్రతికుటుంబం యెంతవరకు బాగుపడుతుందన్న ప్రాతిపదికమీద ఆదర్శ గ్రామాన్ని యెన్నుకోవాలని చర్చలలో జోక్యం కల్పించుకొని శ్రీశంకర గురుస్వామి అన్నారు. అధికారులు, అనధికారులు అధిక కృషి సలిపి ఆదర్శగ్రామంగా తయారుచేయుటకు వీలుగా అట్టి గ్రామాన్ని ఎన్నుకోవాలని శ్రీరాందేవరెడ్డి సభ్యులను కోరారు.

సమితి అనేక విషయాలను చర్చించుటతోపాటు సంగమేశ్వరంనుండి యేక్‌లక్షన్ పేటవరకు రు. 15,750ల ఖర్చుతో రోడ్డును నిర్మించుటకు అంచనాలను మంజూరుచేసినది. ఇంకా షాద్‌నగర్, దొంకల్, నిడదవేలి, లేమామిడి. ఇర్గన్‌పల్లి రోడ్ల నిర్మాణానికై రు. 61 వేలనుగూడా సమితి మంజూరు చేసినది.

తాష్కెంట్‌లో భారతీయ కళాకారుల ప్రదర్శన

తాష్కెంట్, ఆగస్టు 12

మంగోలియన్ ప్రజా రిపబ్లిక్ నుండి స్వదేశానికి తిరిగివెళుతున్న భారతీయ కళాకారులు నేడిక్కడ ఒక ప్రదర్శన నిచ్చారు.

ఆ ప్రదర్శనలో భారతదేశపు శాస్త్రీయ నృత్యాలు, జానపద గేయాలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రతిభావంతురాలయిన నర్తకి అనురాధ నృత్యాలు, బెంగాలీ గాయకులు నిర్మలేందుచౌదరి, ఆయనసోదరి మణుల పాటలు జంత్రీవాద్యకారులు పరన్‌రాని చనుర్‌లాల్‌ల జంత్రవాద్య సంగీతం ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

మాస్కో యువజనోత్సవాలలో నిర్మలేందుచౌదరి బహుమతిపొందారు.

భారతీయ కళాకారులు ప్రాగ్ నగరం సమర్కండులోకూడా కొన్ని ప్రదర్శనలనిచ్చారు

మైనర్ ఇరిగేషన్‌కై మూడో ప్రణాళికలో 25 కోట్లు

ప్లానింగ్ మంత్రి శ్రీ రంగారెడ్డి వెల్లడి

కర్నూలు, ఆగస్టు 12

"పాత చెరువుల మరమ్మతులోసంలీన్న నీటి పారుదలకోసం తృతీయ పంచవర్షప్రణాళికలో 25 కోట్లుకేటాయించామని" ప్రణాళిక మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి గత 9న గిద్దలూరు తాలూకా ఆకవీడు గ్రామములో మాధ్యమిక పాఠశాల ప్రారంభసందర్భంలో తెల్పారు.

ఈబహిరంగసభకు జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులు శ్రీమద్దూరు సుబ్బారెడ్డి అధ్యక్షతవహించారు.

ప్రార్థనతో సభ ప్రారంభమైంది. పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీ టి. సుబ్బరాయుడు, పంచాయతీబోర్డు స్వాగతపత్రాలను సమర్పించారు.

మంత్రి స్వాగతపత్రాలకు సమాధానమిస్తూ ఇలా అన్నారు.

"ఆకవీడులో ఆనాదినుండి ఆనైక్యతతోనున్న ప్రజలు ముందుకువచ్చి మాధ్యమిక పాఠశాలను ఏర్పరచుకొన్నందులకు చాలా సంతోషము కాబట్టి 1961 జూన్‌కు తప్పక పాఠశాల ఏర్పాటుచేయిస్తాను.నేనుచదువుకొనే రోజుల్లో మన తాలూకాలో హైస్కూలులేదు. ఇప్పుడు తొమ్మిది హైస్కూల్లు, 4 మాధ్యమికపాఠశాలలున్నవి. మరియు ఈ సంవత్సరమే తురిమి

నేటిరాత్రి నేటిరాత్రి

పట్టిరాజా వారి

* విమల *

(తెలుగు)

ఎన్. టి. రామారావు, సావిత్రి, రేలంగి, గుమ్మడి, రమణారెడ్డి, సంధ్య.

సాగర్ & అజంతా

హైద్రాబాద్. సికింద్రాబాద్.

ఆటలు: 2-30, 6-00 మరియు 9-30 గం॥

సాగర్‌లో 12 నుండి 15 వ తేదీవరకు రోజు ఉ॥ 11-00 గం॥ ప్రత్యేక ఆట.

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్ గలదు.

మరియు రాజరాజేశ్వరి-వరంగల్,

(Trupix) —భ్రమియా విడుదల.

నేటిరాత్రి నేటిరాత్రి

పాలకుల పాలిటి దొంగ, ప్రజలపాలిటి దోర అయిన అహోయ వీరుని అసమాన గాథ.

శ్రీకృష్ణసాయి ఫిల్మ్స్ వారి

వీరజగ్గడు

(తెలుగు)

మాటలు, పాటలు: ఆరుద్ర. సంగీతం: పామర్తి. నిర్మాత యర్రా అప్పారావు.

కమల్ హైద్రాబాద్. చిత్రా సికింద్రాబాద్.

ఆటలు: 3-15, 6-30 మరియు 9-45 గం॥

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

మరియు లక్ష్మీ-వరంగల్.

(Nima) —పూర్ణా విడుదల.

4 వ సంయుక్త వారము

జీవన్ ఫిల్మ్స్ వారి

* పతివ్రత *

(తెలుగు)

తా॥ సావిత్రి, రాజసులోచన, జి. వరలక్ష్మి, ఎస్. వి. రంగారావు, జెమినీ గణేశన్

దర్శకత్వం: చిత్రపునారాయణమూర్తి. సంగీతం: ఎమ్. రంగారావు.

దిల్‌షాద్ హైద్రాబాదు. రాజేశ్వర్ సికింద్రాబాదు.

ఆటలు: 2-30, 6-00, 9-30 గం॥

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్ గలదు.

(Nima) —జాగృతి పిక్చర్స్ రిలీజ్.

6 వ సంయుక్త వారము

శ్రావ్యమైన పాటలతో ప్రతివారిని ఆకర్షించు చిత్రము.

భార్గవీ ఫిల్మ్స్

దేవాంతకుడు

(తెలుగు)

తా॥ ఎన్. టి. రామారావు, కృష్ణకుమారి, యస్. వి. రంగారావు,

దీపక్ & మినర్వా

హైద్రాబాద్ సికింద్రాబాద్

ఆటలు: 2-30, 6-00, 9-30 గం॥

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

మరియు మార్కండేయ- వరంగల్. అశోక్- నిజామాబాద్.

(Nima) —ఈస్టు ఇండియా రిలీజ్.

శ్రీ తెన్నేటి విశ్వనాథం విస్తృత పర్యటన

ప్రజాపార్టీ బలపడగలదని డా॥ నాగేశ్వరరావు ఆశాభావం

రాజమండ్రి, ఆగస్టు 12

ఆగస్టు 7వ తేదీ రాత్రి రాజమండ్రి పట్టణ ప్రజాపార్టీ సమావేశం ఆంధ్ర ప్రజాపార్టీ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎ. వి. నాగేశ్వరరావు (ఎం. ఎల్. సి.) అధ్యక్షతను జరిగినది

డా॥ నాగేశ్వరరావు ప్రసంగిస్తూ, శ్రీ తెన్నేటి విశ్వనాథం ఇండియా ప్రభుత్వ కంపెనీ వ్యవహారాల సంఘ అధ్యక్షులుగా ఆనిండియా కాఫీబోర్డు అధ్యక్షులుగా వెళ్ళిన తరువాత ఆంధ్ర ప్రజాపార్టీ కొందరు బలహీనపడినా, పార్టీ ముఖ్యులు శ్రీ లక్కిన రామకృష్ణారెడ్డి శ్రీ వాడ్రేవు పాలకృష్ణ అకాల మరణానంతరం ఇంకా పార్టీ బలపడిన పడకుండా ఉండేందుకు మరో రెండు సంవత్సరములు కాఫీబోర్డు అధ్యక్ష పదవిలో ఉండగలిగినప్పటికీ రాజీనామా యిచ్చి ప్రజాపార్టీకి నాయకత్వం వహించిన శ్రీ విశ్వనాథంను అభినందించారు. ఆయన అన్ని జిల్లాలలోను పర్యటన ప్రారంభింపనున్నారని ప్రస్తుతం విశాఖ జిల్లాలో పార్టీ ప్రచారంలోనున్నారని చెప్పి ఆయన నాయకత్వంలో పార్టీ అభివృద్ధిపొందగలదనే ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. తరువాత శ్రీ లంక రాములు అధ్యక్షులుగా నూతన కార్యనిర్వాహకవర్గం ఎన్నుకోబడింది.

కాంగో రిఫరెండం: అబాకో పార్టీ విజ్ఞప్తి

కొట్లాటల్లో లుముంబా గాయపడలేదట

లియోపాల్డువిలి, ఆగస్టు 12

కాంగోను కమ్యూనిజం బారినుండి కాపాడి కాంగో అంతరంగిక వ్యవస్థను గురించి రిఫరెండం జరపాలిందిగా అబాకోపార్టీ కార్యవర్గం నిన్న ఐక్య రాజ్యసమితికి ఒక విజ్ఞప్తి చేసింది.

దిగువ కాంగో ప్రజలు పూర్తిగా కమ్యూనిస్టు వ్యతిరేకులని పేర్కొనబడుతున్నది.

అంతర్యుద్ధానికి తలపడవలదని కాంగోప్రధాని లుముంబా నిన్న రేడియోద్వారా దేశప్రజలందరికీ ఒక విజ్ఞప్తి చేశాడు. ప్రపంచ దృష్టి అంతా ఇప్పుడు కాంగోమీదవున్నదన్న అంశాన్ని మరువరాదన్నారు. మొన్న లియోపాల్డు విలిలో జరిగిన కొట్లాటలు అంత పెద్దగా పరిగణించదగినవి కావని అన్నాడు.

తాను మొన్నటి సంఘటనల్లో గాయపడినట్లు తప్పుడు వార్తాప్రచారము చేసినందుకు కాంగోలోని బెల్జా వార్తా సంస్థను ప్రధాని లుముంబా రద్దుపరుస్తూ ఉత్తర్వుచేశాడుకూడా. ఆరు వార్తా పత్రికల్ని కూడా లుముంబా బహిష్కరిస్తున్నాడని తెలుస్తున్నది.

కాంగోప్రధాని గాయపడలేదని ఘనా పోలీసుఅధిపతి ఆక్రారు తెలియపరిచినట్లు కూడా ఘనా ప్రభుత్వము చెల్లడించింది.

సమితి ఉన్నత కార్యదర్శి డాగ్ హామర్షెల్డు కటాంగాకు సేనల్ని నడిపించేందుకై గతరాత్రి లియోపాల్డు విలి చేరుకున్నాడు.

రేడియో కార్యక్రమాలు

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

ఆదివారం, ఆగస్టు 14

ఉ॥ 6-30 సుప్రభాత్, కార్యక్రమ వివరణ 6-40 భక్తిరంజని: 7-00 తె-వా, 7-15 అమరవాణి (విజయవాడనుండి రిలే) 7-30 అనంత్‌లాల్: శహనాయ్. భూపాలీతోడి 7-45సంగీత శిక్షణ 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 సుబద సంగీత్ 8-45 పిల్లలకు కొత్తపాటలు 9-00 "బచ్చోంకేలియే" 9-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 చిత్రజగత్ 1-00 రంగవల్లి స్త్రీల కార్యక్రమం, మణికింకిణి, సంగీత రూపకము, రచన: డి. వి కె శాస్త్రి, సంగీతము: పి: విశ్వనాథం విశ్వరూపము రూపకము, మంగళం 1-30 శ్రీకృష్ణశంధార్థదరువులు 1-50 తె-వా, 2-00 భజన్ 2-10 ఉ వా. 2-20 బాలవినోదం, పిల్లల కార్యక్రమము, రారండోయ్, యమునాతీరే నాటిక, విజ్ఞానపేటిక, కావ్యకుసుమాలు, పాటనేర్చుకోండి, అవీ, ఇవీ 3-00 తరుణ భారతి, యువజనుల కార్యక్రమము, నిర్వహణ: బి. వి, రమణరావు, డా॥ ఎ. అప్పారావు. పాల్గొనువారు; ఉస్మానియా విశ్వవిద్యాలయ వ్యవసాయ కళాశాల విద్యార్థులు 4-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానికప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 నగర వాణి, ముక్తభారతి. స్వాతంత్ర్య దిన సమయ కవిసమ్మేళనము 7-00 తె-వా, 7-15 కన్నడ శ్రోతలకు 7-30 రూపకము (ఉర్దూ) 8-00 మువ్వగోపాల సంగీత నాటిక (విజయవాడ నుండి రిలే) 9-00 ఆం-వా, 9-15 ఉ-వా, 9-30 (ఢిల్లీనుండి రిలే) 9-45 ఇ. సులోచనాదేవి: భజన్ 10-00 ప్రకటింపబడును 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాదు-బి

49.(ఇ మీ (6120 కిలోసై)

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎవలె, 8-45 కమలారాఘవన్ 9-00 ప్రసార సమాప్తి.

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైద్రాబాద్ ఎవలె, 2-10 శాస్త్రీయ సంగీతము, చెంబై వైద్యనాథ భాగవతర్ 2-20 హైద్రాబాదు ఎవలె, 4-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా॥ 6-00 హైద్రాబాద్ ఎవలె 6-15 గ్రామస్థుల కార్యక్రమము, శ్రీకృష్ణ జననం నాటిక, ప్రకటనలు, వాతావరణము 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, కంసవధ, పురాణకాలక్షేపం 7-30 కమలారాఘవన్ 8-00 హైద్రాబాద్ ఎవలె 9-15 ప్రసంగము 9-30 హైదరాబాద్ ఎవలె, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు 6-35 దేశభక్తి గేయము, 6-40భక్తిరంజని: 7-00 తె-వా, 7-15 "అమరవాణి"గోపికాగీతికలు (మహాభారతమునుండి) రేడియోఅనుసరణ: కె.వి.ఎన్. శాస్త్రి 7-30 ఎ. ఐ. ఆర్. వాద్యబృందము 7-45 సంగీత శిక్షణ 8-00 ఆం-వా, 8-15 పాలపెల్లి, చిన్నపిల్లల కార్యక్రమము, పాపల్లారా రారండి, చిన్నికృష్ణమ్మ, సంగీతరూపకము, "బాలవినోదసంఘం బాలురు" చిలుకపల్కులు, ఇకచాలు 9-00 ప్రసారసమాప్తి.

మ॥ 12-30 ఎమ్. కమలా దేవి 1-00 లలితసంగీతం 1-30 విస్మిల్లా. బృందం: శహనాయ్ 1-50 తె-వా, 2-00 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయవార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, శ్రీకృష్ణ జననం, నాటిక 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమం, కంసవధ పురాణ కాలక్షేపం 7-30 ఉభయ కుశలోపరి, శ్రోతల ఉత్తరాలకు జవాబులు 7-45 యెంకిపాటలు 8-00 మువ్వగోపాల సంగీత రూపకము, రచన కాటూరి వెంకటేశ్వరరావు 9-00 ఆం-వా, 9-15 లలిత సంగీతం: కె. ఎస్. వీరరాఘవన్ 9-30 (ఢిల్లీనుండి రిలే), 9-45 వాద్య బృందము 10-00 ఎమ్. కమలా దేవి 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

ఆహార ధాన్యాల ధరల పరిశీలన

ఉపసంఘానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 12

కొనుగోలు వస్తువులు ముఖ్యంగా ఆహార ధాన్యాల ధరల హెచ్చుతగ్గుల మార్కెటు పరిస్థితిని పరిశీలించి నివేదిక అందజేయాల్సిందిగా కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ కార్యవర్గము నిన్న ఉపసంఘాన్ని కోరింది. ఈ ఉపసంఘం కొన్నాళ్ళ క్రితము శ్రీ ఫిరోజ్‌గాంధి, శ్రీ హెచ్. సి. దాసప్ప, శ్రీ ఆర్. ఆర్. మొరార్కాలతో ఏర్పాటు చేయబడింది.

గ్రామ వార్తలు

పరకాలసమితి ప్రభుత్వ టీచర్ల యూనియన్

పరకాల, ఆగస్టు 12

పరకాల ప్రభుత్వోన్నత పాఠశాలావరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోపాధ్యాయ సంఘము, పరకాలసమితి కార్యవర్గము, సమితి అధ్యక్షులు శ్రీ దమ్మాల పాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఉపాధ్యాయులకు నిర్ణయించిన వేతన క్రమములను పునః పరిశీలించి, ఈమధ్యనే మద్రాస్ ప్రభుత్వము ఉపాధ్యాయులకు నిర్ణయించిన వేతన క్రమములను ఆంధ్రప్రదేశ్‌లోకూడా అమలు జరిపించవలసినదిగాను, 1959 సంవత్సరము వేసవి సెలవులలో పంచాయతీ ఎన్నికలలో పనిచేసిన ఉపాధ్యాయుల ప్రివిలేని లీవు మంజూరు, 1-11-58 నుండి అమలులోనికి వచ్చిన నూతన వేతన క్రమముల బకాయిల చెల్లింపునకు అవసరమైన నిధులనుజాప్యంచేయకుండా వెంటనే జిల్లాపరిషత్తు పంచాయతీసమితులకుసమకూర్చవలసినదిగా ప్రభుత్వమును అభ్యర్థించు తీర్మానములా మోదింపబడినవి.

అల్యాబాదు పాఠశాల విద్యార్థుల యూనియన్

అల్యాబాద్, ఆగస్టు 12

మేడిచల్ తాలూకాలోని అల్యాబాదు గ్రామములోని జూనియర్ బేసిక్ స్కూలు విద్యార్థులంతా శ్రీ కె కృష్ణారావు అధ్యక్షతన సమావేశమై విద్యార్థి యూనియన్‌ను నెలకొల్పిరి.

ఎన్నికలు యీ క్రింది విధముగా జరిగినవి:

ఎన్. నర్సింహులు (అధ్యక్షుడు), వి. మల్లారెడ్డి (కార్యదర్శి) వి. భాస్కర్ రెడ్డి (కోశాధ్యక్షుడు) పి. విజయ భారతి (బాలికల కార్యదర్శిని) ఎ భారతి (సహాయ కార్యదర్శిని) కార్య నిర్వాహక సభ్యులుగా ఎం. రాధాబాయి, ఎం. భాగ్యలక్ష్మి ఆర్. పండరి, ఎ నర్సింహారెడ్డి, ఎం. వై కుంతమ్, మహమద్ గౌస్, పి. మనోహర్, కె. దశరథ, వి ఎల్లయ్య, పి మైసయ్య ఎన్నికయ్యారు.

చందూరు గ్రామ అప్రోచ్‌రోడ్ ప్రారంభోత్సవం

నిజామాబాద్, ఆగస్టు 11

చందూరు గ్రామ అప్రోచ్‌రోడ్‌కు ఈనెల 5వ తేదీన జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ చౌటుపల్లి హన్మంతరెడ్డి ప్రారంభోత్సవము చేశారు. దీనిని గ్రామస్థులైన గ్రామప్రజలు రు 5 వేలు పోగుచేయుటద్వారా సహకరించారు. అదే గ్రామములో 6వ తరగతిని జిల్లా విద్యాధికారి శ్రీ ఎం సుదర్శనాచారి పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. జిల్లా పరిషత్తు, పంచాయతీసమితి చట్టము ప్రకారము ప్రజాప్రతినిధులు ప్రత్యేకించి పంచాయత్ సభ్యులు నిర్వహించవలసిన బాధ్యతను శ్రీ రెడ్డి వివరించారు ఈనూతన పరిపాలనా వ్యవస్థలో బీదతనం, అవిద్య, అజ్ఞానాన్ని ఎదుర్కొనేహక్కు ప్రతి పౌరునికి కలదనీ సాంకేతిక సలహా, ఆర్థికసహాయము కలుగచేయుట ద్వారా ప్రభుత్వం ప్రజలకు తోడ్పడగలదన్నారు. 1961-62లో నిర్బంధ విద్య అమలులోనికి రాగలదని జిల్లా విద్యాధికారి తెలిపారు

6 నుండి 11 యేండ్ల వయస్సుగల పిల్లలకు విద్య చెప్పించుట ప్రతిరుటుంబముయొక్క ప్రాథమిక విధియని ఆయన అన్నారు.

నాగారం సెక్టర్ ప్రభుత్వోపాధ్యాయ సంఘ ఎన్నికలు

నాగారం, ఆగస్టు 12

నాగారం, సెక్టర్ ప్రభుత్వోపాధ్యాయ సంఘ ఎన్నికలు, శ్రీ వి. మల్లారెడ్డి (ప్ర.ఉ. ఉన్నత పాఠశాలతిర్మలగిరి) అధ్యక్షతన జరిగి ఈక్రిందివారు కార్యనిర్వాహక వర్గముగా ఎన్నుకొనబడిరి:

అధ్యక్షులు వి. రాంరెడ్డి, ఉపాధ్యక్షులు వి. మోహన్ రెడ్డి, కార్యదర్శి ఎస్. దామోదర్ రెడ్డి, సహాయకార్యదర్శి యం. రాఘవాచారి, కోశాధికారి కె. సుధాకర్ రెడ్డి.

రాజ్యసభ సంతాప ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 12

మధ్యప్రదేశ్‌నుండి రాజ్యసభకు ఎన్నికైన కాంగ్రెసు సభ్యుడు శ్రీ టి. డి పుష్తకే నిన్న సాయంత్రం ఉజ్జయినిలో చనిపోయినందుకు సంతాప సూచకంగా యీవేళ రాజ్య సభ ఒక నిమిషం మౌనం పాటించింది.

బ్రిటన్‌కు ఇండియా ఎగుమతులు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో భారతదేశంనుంచి బ్రిటన్ కు 7,00,05,00) పౌన్లు విలువగల వస్తువులు ఎగుమతి అయినవి. 1959లో మొదటి ఆరు నెలల్లోకంటే 58 88,100 పౌన్లు విలువ వస్తువులు ఎక్కువగా ఎగుమతి అయినవన్నమాట. 1959 మొదటి ఆరు నెలల్లో ఈ రెండు దేశాల ఎగుమతి దిగుమతుల మధ్య వ్యత్యాసం ఈ యేడు మొదటి ఆరు నెలల్లో తగ్గినది క్రిందటి సంవత్సరం ఇదే కాలంలో సా 8,27, 9,000ల వస్తువులు బ్రిటన్‌నుంచి భారతదేశానికి ఎగుమతి అయినవి ఈ యేడు సా 7,88,03,000ల వస్తువులు ఎగుమతి అయినవి. ఈ యేడు భారతదేశంనుంచి బ్రిటన్‌కు "టీ" ఎక్కువగా ఎగుమతి అయినది సా 2,32, 19,000ల టీ ఎగుమతి అయినది క్రిందటి సంవత్సరం ఇదే కాలంలో సా 2 07,18,000ల టీ ఎగుమతి అయింది.

తురకపల్లిలో బాలయోగి

తురకపల్లి, ఆగస్టు 12

మేడిచల్ తాలూకాలోని తురకపల్లి అనేగ్రామంలో 19 సంవత్సరాల వయస్సుగల లింగిశెట్టి విఠల్ అను యువకుడు విరాగియై అచ్చటగల ఒక శివాలయములో నివసించుచూ, అన్నాహారములను వర్జించి కేవలము జలములను మాత్రమే గ్రహించి తీర్థప్రసాదములనిచ్చి రోగపీడితుల రోగములను బాగుచేయుచున్నాడు. ఇతని స్వగ్రామము సిద్దిపేట సమీపంలోనున్న పెద్ద వంగపల్లి కులము పద్మశాలి 1950 సం॥లో హెచ్-ఎస్-సి పరీక్ష కంపార్టుమెంటల్‌గా ఉత్తీర్ణుడై ఉద్యోగమునకై హైద్రాబాదులో ప్రయత్నము చేశాడట కాని ఆప్రయత్నము విఫలముకాగా నేరుగా రోడ్డు వెంబడి నడచివస్తూ హైద్రాబాదునకు 20 మైళ్ళ దూరములోనున్న తురకపల్లి గ్రామ శివార్లలోని శివాలయములో ప్రవేశించి దానిని శుద్ధి చేశాడట. ఇతనికి తల్లి గలదు, నల్గురు అన్నలు అక్కగలరని తెలియుచున్నది. (ఒ-వి)

దిబ్రూగఢ్‌కు తుఫాన్ తాకిడి

దిబ్రుగఢ్, ఆగస్టు 12

బుధవారం తెల్లవారు జామున దిబ్రూగఢ్ ప్రాంతాల్లో తుఫాను తాకిడి తగిలింది. ఒక గంటపాటు వీచిన తుఫానుగాలికి చాలా చెట్లు కూలిపోయాయి, టెలిఫోన్ టెలిగ్రాఫ్ సౌకర్యాలు దెబ్బతిన్నాయి. అనేక గుడిసెలు ఎగిరి పోయాయి కూడా. ఒక చెట్టుకూలిపడి మూడు ప్రభుత్వ కార్యాలయాలున్న భవనం కొంత భాగం దెబ్బతిన్నది.

చాద్ రిపబ్లిక్ స్వాతంత్ర్య ప్రకటన

ఫోర్టులామే, ఆగస్టు 12

చాద్ రిపబ్లిక్ ప్రధాని ఫ్రాంక్వాయిస్ టాంబల్‌బాయే నిన్న ఫ్రాన్స్ పాలననుండి విముక్తమై సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ప్రకటించాడు. ఈ చాద్ రిపబ్లిక్ ఫ్రాన్స్‌కు రెట్టింపు విశాలం కలది, ఆఫ్రికా నడిబొడ్డునగల యీ చాద్ రిపబ్లిక్ జనాభా 2721300; ప్రత్తి, బియ్యం పండుతాయి, పశుసంపత్తి ఉంది.

(1) కేంద్ర ఆఫ్రికన్ రిపబ్లిక్, (2) మాజీ ఫ్రెంచి కాంగో, (3) గాబాన్‌లు వచ్చే బుధవారం స్వాతంత్ర్యం పొందుతాయి. మౌరిటానియాకు నవంబరులో స్వాతంత్ర్యం లభిస్తుందని అనుకుంటున్నారు.

దారుస్సలాం సమస్య

తామీరె మిల్లత్ ప్రతిపాదన

హైద్రాబాద్, ఆగస్టు 12

ప్రభుత్వం నుండి దారుస్సలాంను తీసుకొనుటకు ప్రజల విశ్వాసం గల ముస్లిం సంస్థలన్నీ యేకం కావాలని తామీరె మిల్లత్ ప్రతిపాదించినది. దారుస్సలాం తమదని వాదించే వారు న్యాయస్థానంద్వారా అట్టి పరిగణను పొందాలని, అప్పుడే వారికది ఒప్పగించబడునని ప్రకటించుట ద్వారా ముస్లిములకు ప్రభుత్వ మెట్టి తోడ్పాటుచేయలేదని మిల్లత్ ఒకతీర్మానంలో పేర్కొన్నది.

ప్రభుత్వం సానుభూతి చూపనిచో, దారుస్సలాం యాజమాన్యం సమస్యపరిష్కరించబడదని అందులో పేర్కొనబడినది. ప్రభుత్వం ప్రకటించిన పరతులను ఏఒక్క పార్టీవారు ప్రస్తుత పరిస్థితులలో పూర్తి చేయజాలరని అందులో తెలుపబడినది.

నిలువుగా పైకిఎగిరే విమానాలు

లండన్, ఆగస్టు 12

హాంప్‌షైర్‌లోని ఫారన్‌బరోలో సెప్టెంబరులో బ్రిటిష్ విమానాలనిర్మాతల సంఘం ఆధ్వర్యాన జరిగే విమానాల ప్రదర్శనలో షార్ట్ ఎస్ సి-1 విమానాన్ని కూడా చూపించుతారు. ఇది నిట్టనిలువుగా పైకిఎగిరివెళ్ళుతుంది. నిట్టనిలువుగా పైకివెళ్ళే ఆమ్‌స్ట్రాంగ్-వైట్ వర్టు అగ్రాన్, అట్లాంటిక్-748 దిహానిలెండ్ హామెట్, హాంప్లేజ్ పెరాల్డు, వికర్స్ వాన్‌గార్డు విమానాలను కూడా చూపించుతారు. ఇంకా రకరకాల విమానాలు ప్రదర్శనకు వస్తవి.

కేంద్ర ప్రభుత్వ చర్యల నిరసన

కమ్యూనిస్టుపార్టీ కార్యవర్గ తీర్మానం

న్యూఢిల్లీ, ఆగస్టు 12

కేంద్ర ప్రభుత్వోద్యోగులపై ప్రతీకార చర్యలు తీసుకోడము, క్రేడ్ యూనియన్ హక్కుంపై దాడికి పూనుకోడం మున్నగు కేంద్రప్రభుత్వ చర్యల్ని నిరసిస్తూ తక్షణమే సిబ్బందిపై గల కేసుల్ని ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరుతూ భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గము తీర్మానించింది.

13 వ వారము

కమాల్ అమ్రోహిస్

దిల్ అప్నా

ఔర్

ప్రీత్ పరాయి

రాయల్

హైద్రాబాద్

నేడు 3 ఆటలు: 3-15, 6-30, 9-30.

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

—శ్రీ సినీ కార్పొరేషన్ విడుదల.

(Trupix)

నేడే చూడండి!

మినర్వా పిక్చర్స్

పెళ్ళి కానుక

(తెలుగు)

తా॥ నాగేశ్వరరావు, వి. సరోజాదేవి, కృష్ణకుమారి, గిరిజ, రేలంగి.

జగత్ టాకీస్

హైదరాబాద్, హైద్రాబాదు.

ఆటలు: 3-15, 6-30, 9-30.

(Nima)

నేటిరాత్రి నేటిరాత్రి

మధ్యతరగతి కుటుంబముల గాథను చిత్రించిన అత్యుత్తమ చిత్రము.

రాజ్ కళావారి సాంఘిక చిత్రము

ఎక్ కే బాద్ ఎక్

తా: దేవానంద్, నూతననటి శారద, తరల, ప్రభుదయాల్, ఎస్. కె. పేగ్, రాధాకృష్ణన్, హీరాలాల్.

షకీలాబాను భూపాలి, రెండు రీల్స్ ఖవాలి కార్యక్రమం మిమ్ముల తన్మయులజేయును.

ఇండియాలో పేరెన్నికగన్న ఖవాలి తార.

అశోక్ హైద్రాబాదు మనోహర్ సికింద్రాబాదు

శని, ఆది, సోమ 3 ఆటలు: 3-30, 6-30, 9-30.

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

(Trupix) —ప్రకాశ్ పిక్చర్స్ విడుదల.

16 వ సంయుక్త వారము

ఫిల్మ్ లయాన్స్

* లా - ఇన్ - సిమ్లా*

తారలు: సాధన, జాయ్ ముఖర్జి.

జమ్‌ఖుద్ మహల్ - హైద్రాబాదు.

ఆటలు: 3-30. 6-30, 9-30 గం॥

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

(Trupix) చిత్ర కళా పిక్చర్స్ విడుదల.

4 వ మహత్తర వారము

నియోలైట్ ఫిల్మ్స్:

పోలీస్ డిటెక్టివ్

లిబర్టీ హైద్రాబాద్

యాకుత్‌మహల్

హైద్రాబాద్.

8-30, 6-30, 9-30 గం॥

హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

శ్రీ సినీ కార్పొరేషన్ విడుదల.

(Trupix)

8 వ సంయుక్త వారము

సుశీతవ వారి:

భక్త శబరి

(తెలుగు)

రహత్- ముషీరాబాద్.

రీగల్ - హైద్రాబాద్.

ఆటలు: 2-45, 6-00, 9-30 గం॥

హెచ్చుతరగతులకు అడ్వాన్సు బుకింగ్

సుందర్ పిక్చర్స్ సర్క్యూట్ విడుదల.

మార్కెట్ వివరాలు

మెర్స్ కల్వ సూర్యనారాయణ
మర్చంట్ అండ్ కమీషన్ ఏజంట్
ఉస్మాన్‌గంజ్-హైదరాబాదు
ఫోన్ నెం 4412

హైదరాబాద్, ఆగస్టు 12
(వల్లా ఒక్కంటికి 120 శేర్లు)

నానకరాంలు	68-0-0	72-0-0
గర్కలు	59-0-0	61-8-0
పాలకుర్కులు	64-0-0	67-8-0
24 నంబర్లు	74-0-0	77-0-0
బంగారుతీగెలు	71-0-0	75-0-0
గుజ్జులు	68-0-0	71-0-0
గొర్రెవియ్యం	58-0-0	60-0-0
కుసుమవియ్యం	65-0-0	67-0-0
తొడ్డు వియ్యం	61-0-0	64-0-0
[illegible]	64-0-0	67-0-0
సాంబర్లు పా॥		
కొత్త సాంబర్లు	79-0-0	80-0-0
మాకలు	41-0-0	52-0-0
వరంగల్ సాం. పా॥		
బన్సీగోధుమలు	72-0-0	77-0-0
కుస్మలు	64-0-0	67-0-0
కందులుపెద్దవి కొ॥	52-0-0	55-8-0
కందులుచిన్నవి కొ॥	44-0-0	49-12-0
మినుములు	52-0-0	55-8-0
పెసగలు	49-0-0	52-0-0
బెల్లం	53-0-0	64-0-0
పెసళ్ళు కొ॥	47-0-0	49-8-0
తెల్లజొన్నలు	49-0-0	51-0-0
పచ్చజొన్నలు	44-0-0	46-0-0
మిరపకాయలు	210-0-0	260-0-0
నెపు	124-0-0	135-0-0
ఉల్లిగడ్డ కొ॥	10-8-0	14-4-0
చింతపండు కొ॥	80-0-0	114-0-0
నల్లవులువలు	40-0-0	40-8-0
తెల్లనువ్వులు	132-0-0	148-0-0
నద్దలు	45-0-0	47-0-0
పెద్ద కందిపప్పు	75-0-0	78-0-0
చిన్న కందిపప్పు	63-0-0	68-0-0
పెసగపప్పు	56-0-0	60-0-0
పెసరపప్పు	72-0-0	75-0-0
మినుప పప్పు	74-0-0	77-0-0
ఆముదాలు	71-0-0	72-8-0
లంకపిండి	51-0-0	52-0-0
ఇలాతికాయ చి॥	78-0-0	81-8-0
యెర్రనువ్వులు	133-0-0	1-360-0
[illegible]	52-0-0	54-0-0

(12 శేర్ల మణుగు)

ధనియాలు	19-0-0	20-0-0
అల్లం	9-0-0	11-0-0
యెల్లిగడ్డ	4-0-0	5-8-0
పల్కుమావె	21-6-0	21-8-0
ఆలుగడ్డ	4-12-0	5-4-0

22 వ సంయుక్త వారము
గురుదత్స్
చౌధ్వీకా చాంద్
ప్రభాత్ హైదరాబాద్.
3 ఆటలు:
3-15, 6-15 మరియు 9-30 గం॥
అలంకార్ సికింద్రాబాద్.
3-30, 6-30, 9-30 గం॥
హెచ్చు తరగతులకు
అడ్వాన్సు బుకింగ్.
జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ విడుదల.
(Trupix)

గొప్ప వేలం అమ్మకము

నిజాం ప్రయివేట్ స్టేట్ మేనేజింగ్ కమిటీ ఉత్తరువు ప్రకారము హైదరాబాద్ మునిసిపల్ హద్దులలోని ఈదీబజార్‌లోగల సారవంతము, ఫలసాయము నిచ్చుచున్న బాగ్ మామా దిలారమ్ అను 76 ఎకరముల భూమి అందుగల మూడు పక్కా వాడకపు నూతులు, నల్లాలు అమర్చబడిన రెండు నివాసయోగ్యమైన గొప్ప భవనములుగల స్థలము 29 ఆగస్టు 1960 తేదీ ఆదివారము ఉదయం గం॥ 11-00 లకు వేలంలో అమ్మబడును. పూర్తి వివరములుగల కరపత్రములు పంచిపెట్టబడుచున్నవి.

జె. మూసా అండ్ సన్స్ ఆక్షనీర్స్,
దివాన్‌దేవిడి, ఫోన్: 5111.

సికింద్రాబాద్ రేసెస్

14-8-1960 ఆదివారము సా॥ 3-15 గం॥

మొదటి పందెం ప్రారంభం

హైదరాబాద్ రెసిడెన్సీ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, రాణిగంజ్, మరియు రేస్‌కోర్సుల మధ్యన ఆర్. టి. సి. ప్రత్యేక బస్సులు గలవు.

(B. A. P.)

Edited Printed and Published by N. Narotham Reddy M. A. for the Golkonda Publications Ltdat the Golkonda Printing Press Hyderabad A. P.

నగర వార్తలు

గ్రేటర్ హైదరాబాదు సిటీ లైబ్రరీ అసోసియేషన్

గ్రేటర్ హైదరాబాద్ సిటీ లైబ్రరీ అసోసియేషన్ కార్యవర్గం యీదిగువ వారితో ఎన్నుకోబడింది:

శ్రీధర వామననాయక్ (అధ్యక్షుడు), అబ్దుల్ మహమూద్, అనంతబుచ్చన్న (ఉపాధ్యక్షులు), కె. పి. గోపాల్ (కార్యదర్శి), ఎం. అబ్దుల్ హై (కోశాధిపతి), కె. సుబ్బారావు. మహబూబుద్దీన్, కె. వెంకటస్వామి. శ్రావణకుమార్, ఎస్.వి.ఇనాందార్, కృష్ణ హెచ్ బెందిగిరి, సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి. సరోజా మేల్కోటే (సభ్యులు) ఇద్దరు కార్యదర్శులు, 6గురు సభ్యులను కోఆప్టు చేసుకొనే అధికారం యీ కార్యవర్గానికి కలదు.

గ్రేటర్ హైదరాబాదు సిటీ బస్ డివిజన్ వర్కర్ల యూనియన్

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ సికింద్రాబాద్ డివిజన్ వర్కర్ల యూనియన్ సమావేశం 7 వ తేదీన జరిగి శ్రీ ఎస్. ఆర్. వెంకటేశం అధ్యక్షుడుగా, పి. జగదీశ్వరరావు, కె. హన్సరాజ్‌లు ఉపాధ్యక్షులుగా జి. నరసింహారావు. టి. ఎం. పెరుమాళ్ ప్రధాన కార్యదర్శులుగా పి. మాత్యూస్, ఎస్. మల్లేశ, సంయుక్త కార్యదర్శులుగా, వి. మధుసూదనరావు, హబీబ్ ఖాన్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా, ఎ.పి. హరి కోశాధిపతిగా ఎన్నుకోబడ్డారు. ఈ యూనియన్ ఐ. ఎన్. టి. యు. సి. కి అనుబంధింపబడింది.

ఉత్తర కొరియాలో కృశ్చేవ్ పర్యటన

మాస్కో, ఆగస్టు 12

రష్యా ప్రధాని నికిటాకృశ్చేవ్ అక్టోబరు నెల ఆరంభములో ఉత్తర కొరియాలో అధికార పర్యటన జరుపుతాడని నేడు టాస్ ప్రకటించింది. ఉత్తరకొరియా ప్రభుత్వము, వర్కర్ల పార్టీ కృశ్చేవ్‌ను ఆహ్వానించాయట. ఇది కృశ్చేవ్ ఉత్తరకొరియా ప్రథమ పర్యటన కాగలదు.

సికింద్రాబాదునల్లగుట్ట, సర్ రొనాల్డ్‌రాస్ రోడ్డులో శ్రీ సాయి నిలయమందు స్వస్తి శ్రీ శార్వరినామ సం॥ శ్రావణ బ॥ 8 ఆదివారం ది. 14-8-60 రోజున ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకము 8-30 నుండి, లఘార్చన [పతి], పూలు, తులశి] జరుగును.

వెండి బంగారు ధరలు

సముద్రాల రాఘవులు గారి చంద్రయ్య దుకాణం
సిద్దంబర్ బజార్, ఫోన్ నెం. 4890

హైదరాబాద్, ఆగస్టు 12

బంగారం	189-4-0
ఆశోక్‌చీఫ్	189-8-0
సవరన్	87-0-0
వెండి 100 తు॥	228-0-0
చిల్లర తు॥ 1 కి	2-4-0

న్యూయార్కు ప్రత్తి

న్యూయార్క్, అగస్టు 12

ప్రారంభం	30.	98
ముగింపు	30.	99



రూర్కిలోని ఇరిగేషన్ పరిశోధనా సంస్థలోని గంగానదీ బ్యారేజి నమూనాను యీచిత్రంలో చూడవచ్చు.

ఆదిలాబాదులో సహకార నూలు మిల్లు స్థాపన

ఆదిలాబాద్, ఆగస్టు 12

ఆదిలాబాదులో 35 లక్షల వ్యయముతో ఒక సహకార నూలుమిల్లు స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వము తల పెట్టింది.

ఈ సందర్భముగా చేనేత విభాగం డైరెక్టొరేట్ వారు ప్రాథమిక సర్వే జరుపుతున్నారు.

నూలు మిల్లు ప్రోత్సాహకులు 20 లక్షలు ఇస్తారు, మిగిలినది రిజర్వు బ్యాంక్ ఇతర ఆర్థికసంస్థలు చేకూర్చుతాయి.

ఆదిలాబాదుజిల్లా ముఖ్యముగా ప్రత్తి ఉత్పత్తి స్థానము, ప్రతి యేటా లక్షన్నర బేళ్ళ ప్రత్తి ఇక్కడ ఉత్పత్తి అవుతున్నది.

ఆదిలాబాదులో ఏర్పాటయ్యేసహకార నూలు మిల్లు రాష్ట్రములో ఐదవది. దీనికి ప్రథమములో 12 వేల కదురుళ్ళు ఏర్పాటు చేయబడుతాయి.

హైదరాబాదులో కేంద్ర సిల్కు డిపో

చేనేత విభాగము డైరెక్టొరేటు వారు లక్షన్నర ఖర్చుతో హైదరాబాదులో ఒక కేంద్ర సిల్కు డిపో ఏర్పాటు చేయాలనికూడా తలపెట్టారు. మరో 2 నెలల్లో యీ డిపో పని ప్రారంభిస్తుంది.

ఇటువంటి డిపో రాష్ట్రములో ఇది ఒక్కటే రాష్ట్రములోని చేనేతకార్మికులు తయారుచేసే సిల్కు వస్త్రాలను యీడిపో అమ్ముతుంది.

లావోస్‌లో నూతన ప్రభుత్వ స్థాపనకు షరతులు

విప్లవనాయకుడు కాంగ్లీ వివరణ

వియంటైన్, ఆగస్టు 12

వియంటైన్‌లో విప్లవము జరిపి తాత్కాలిక విప్లవ కమిటీని ఏర్పాటు చేసిన కెప్టెన్ కాంగ్లీ నేడొక ప్రకటనచేస్తూ ప్రస్తుత రాయల్ ప్రభుత్వం రాజీనామా ఇచ్చి ఉత్తర దక్షిణ లావోస్ ప్రజల అభిమతం ప్రకారము ప్రిన్స్ సవన్నా ఫామా నూతనప్రభుత్వము ఏర్పాటు చేయాలని విప్లవ కమిటీ కోరుతున్నదన్నాడు.

లావోస్‌లో అంతర్యుద్ధవిరమణకై పాథెట్ లావోస్ నాయకులతో సంప్రదింపులకు కొత్త ప్రభుత్వము అవకాశాలుకల్పించాలని కాంగ్లీ అన్నాడు.

ప్రస్తుతము లావుంగ్ ప్రభాంగ్‌లో ఉన్న రాయల్ ప్రభుత్వాన్ని వియంటైన్ వచ్చి విప్లవ కమిటీతో సంప్రదింపులు జరపాల్సిందిగాకూడా కాంగ్లీ ఆహ్వానించాడు.

ప్రిన్స్ సవన్నా ఫామా ఒక ప్రకటనచేస్తూ తాను విప్లవ కమిటీ చే ప్రముఖుడుగా పేర్కొన బడడాన్ని ఖండించాడు.

ప్రిన్స్ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేస్తే జాతి అంతా కోరుతున్న షరతుల ప్రకారము విధానాన్ని రూపొందించాల్సి ఉంటుందని కూడా కాంగ్లీ ప్రకటించాడు.

ఆంధ్ర ప్రదేశ్ యాదవమహాసభ

ఆధ్వర్యాన ఆదివారము 14 వ తేదీన సికింద్రాబాద్, బూర్గుమహాదేవ్ హాలులో శ్రీ కృష్ణజయంతి శ్రీ వెంగల అంజయ్య యాదవ అధ్యక్షతన జరుపబడును.

బీదవారికి ప్రభుత్వ భూముల పంపిణీ

ఉపముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి హామీ

నల్లగొండ, ఆగస్టు 12

పంచాయత్ అధ్యక్షులు తమ విధి బాధ్యతలను ఎరుగుట చాల అవసరమని ఈమధ్య భువనగిరిలో జరిగిన గ్రామీపంచాయత్ అధ్యక్షుల సభకు ప్రారంభోత్సవంచేస్తూఉపముఖ్యమంత్రి శ్రీ కె.వి. రంగారెడ్డి అన్నారు. వారికి అధిక అధికారాలను యిచ్చుటకు ప్రభుత్వం ఆలోచించుటకు షీలుగా వారు సేవాసక్తితో చాల కృషి సల్పాలని ఆయన అన్నారు. భూసంస్కరణలకార్యక్రమాన్ని మంత్రిగారు ప్రస్తావిస్తూ ఈ పంపకరాంశానికల్లా ప్రభుత్వభూములను బీదవారికి పంచుటకు నిశ్చయింపబడినదనీఅందుకొరకై ప్రత్యేక సిబ్బందినికూడా వేయడమైనది. 2 ఎకరాల తరి, 5 న్నర ఎకరాల ఖుష్కి ప్రాతిపదికగా ఈ పంపకం జరుగగలదనీ "కాయరాన్" భూమి యేవిధంగాను పంచబడదనీ ఆయన తెలిపారు.

నల్లగొండజిల్లాలో 650 గ్రామ పంచాయతులు వున్నవికాబట్టి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుజరపగల విశ్వాసం తనకు గలదని జిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీ జి. ఎస్. రెడ్డి తన అధ్యక్షోపన్యాసంలో తెలిపారు.

తాలూకా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శ్రీ తుమ్మల లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శ్రీ కె. రామకృష్ణారెడ్డి ఈ సమావేశంలో మాట్లాడారు.

భగవద్గీతోపన్యాసాలు

హైదరాబాద్, ఆగస్టు 12

మచిలీపట్నం శ్రీ గాయత్రీ పీఠాధిపతులు, పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ విద్యాశంకర భారతీ స్వాములవారు ప్రతిదినం సాయంత్రం 6-30 గంటలకు హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీరోడ్డు, నల్లకుంటలోని శ్రీ శంకరమఠంలో భగవద్గీతోపన్యాసాలు చేస్తున్నారు. వారు ఈ సంవత్సరం హైదరాబాదు నగరంలో చాతుర్మాస్యవ్రతం జరుపుతున్నారు.

శ్రీ స్వాములవారు ఆదివారము 14-8-1960వ తేదీన శ్రీ కృష్ణజయంతి శుభదినమున శంకరమఠంలో శ్రీశంకర గ్రంథాలయమును స్థాపించుచున్నారు. ఈ గ్రంథాలయమునకు ఉభయ నగరాలలోని ప్రజలూ, ఇతర స్థలములోనివారు తమవద్ద ఉన్నగ్రంథాలను, ధనమును యీగ్రంథాలయమునకు విరాళముగా ఇవ్వవలసిందని ప్రార్థించబడుతున్నారు.

ఆర్యవైశ్య గ్రంథాలయం

గుంటూరు, ఆగస్టు 12

గుంటూరులో నలుబదిఏండ్ల క్రితం స్థాపించబడి, కొంతకాలం బ్రహ్మాండంగా నడుపబడి గత కొన్నిసంవత్సరాలుగా మూసివేయబడిన శ్రీ ఆర్యవైశ్య గ్రంథాలయం శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంతరఫున దేవస్థానం కమిటీ అధ్యక్షులు, మాజీ మునిసిపల్ చెయిర్మన్, శ్రీ కుసుమహరనాథ సేవామండలి అధ్యక్షులుఅయిన శ్రీ తూనుగుంట వెంకట్రావుగారిచే పునఃప్రముఖుల సమక్షంలో తెరువబడినది. (స్వ. వి.)

ఎరువుల సరఫరా

గుంటూరు తాలూకా కాంగ్రెసు కమిటీ విజ్ఞప్తి

గుంటూరు, ఆగస్టు 12

గుంటూరు తాలూకా కాంగ్రెసు కార్యవర్గ సమావేశము సంఘాధ్యక్షులు శ్రీ శ్యామల గోపాలరెడ్డి అధ్యక్షతన జరిగింది. క్రింది తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదించబడినది.

గుంటూరుజిల్లా పరిషత్ రెండవ స్థాయీసంఘమువారు, లోగడ ఎరువుల క్రయవిక్రయ సెంటర్లు నిర్ణయములో కొన్ని గ్రామాదులు అందుబాటులేని సెంటర్లకు కల్పుట జరిగినదిగాన తిరిగి ఆ గ్రామాదులకు సమీపమునగల సెంటర్లలో చేర్చవలసినదిగాను ప్రస్తుతం అమలులో వున్న ఎరువులపంపిణీ విధానము. పంచాయితి అధ్యక్షులు నిర్ణయించిన చీట్లుప్రకారం పంపకం జరుపుటఆచరణ సాధ్యంకాదు గనుక ఎరువుల పంపిణీ పూర్తి బాధ్యతలు సహకార సంఘములకే యివ్వవలయును. (స్వ. వి)

కుటుంబ నియంత్రణలో పరిశోధన

ఢిల్లీలో కేంద్రం ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

కేంద్ర ఆరోగ్యమంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ అధ్యక్షతన క్రిందటి బుధవారంనాడు ఇక్కడ సమావేశమైన కుటుంబ నియంత్రణ సమాచార, పరిశోధనా సంఘం న్యూఢిల్లీలో కేంద్ర కుటుంబ నియంత్రణ సమాచార పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పాలని సిఫార్సుచేసింది. బొంబాయిలో ఒక పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పాలని కూడా సంఘం సూచించింది. వచ్చేసంవత్సరం మార్చిలో కుటుంబ నియంత్రణసమాచారం, పరిశోధనపై ఒక మహాసభ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను సంఘం ఆమోదించింది.

కుటుంబ నియంత్రణ ప్రచార పరిశోధనను అభివృద్ధి పరచడములో తోడ్పడేనిమిత్తం, పోర్టుధార్మిక సంస్థ 5ఏళ్ళకుగాను 8,30,000 డాలర్లగ్రాంటు ఇవ్వదలచిందనే విషయాన్ని సంఘం గమనించింది. చిన్నపరిశోధనా పథకాలనిర్వహణకు, వైద్యకళాశాలలలోనూ, విశ్వవిద్యాలయాలలోనూ పరిశోధనశాలను ఏర్పాటు చేసి నిర్వహించడానికి, ఒక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి యీడబ్బును వినియోగించడం జరుగుతుంది. ఈ డబ్బంతా కేవలం విద్యా విషయక కార్యక్రమాలకే వినియోగిస్తారు. కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ కార్యక్రమాన్ని అమలుజరిపించి పర్యవేక్షిస్తూ ఉంటుంది.

కళా నికేతనము వారి సాహిత్య గోష్ఠి

హైదరాబాదు, ఆగస్టు 12

కళా నికేతనం ఆధ్వర్యంలో "సామాన్యుణ్ణి నడిపే సాహిత్యము" అనే అంశంపై ఆగస్టు15 స్వాతంత్ర్య దినోత్సవమునాడు సాయంత్రము 5 గంటలకు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయము (సుల్తాన్‌బజారు) నందు సాహిత్య గోష్ఠి జరుగుతుంది. శ్రీ దాశరథి అధ్యక్షతన వహిస్తారు. శ్రీకరుణశ్రీ, ఆరుద్ర, గోరాశాస్త్రి, మానజ ప్రసంగిస్తారు.

నగర వైదిక ధర్మ ప్రచార

సమితి తరఫున 14 వ తేదీ ఆదివారం ఉదయం 8 నుండి 10 వరకు సుభాష్ నగర్ (ఫీలుఖాన)లో నెం. 15-8-422 గల యింటిలో శ్రీ వేదవ్రత ఆర్య యాజమాన్యమున పారివారిక సత్సంగము జరుగును.

రాజకీయ బాధితుల పిల్లలకు విద్యా సౌకర్యాలు

ప్రభుత్వ పథకం సవరణ

హైదరాబాద్, ఆగస్టు 12

రాజకీయ బాధితుల పిల్లలు, మనుమలకు విద్యా సౌకర్యాలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పుడొక సవరింపబడిన పథకాన్ని ఆమోదించింది. దీనితో లోగడ ఈవిషయమై చేసిన ఉత్తర్వులన్నీ రద్దయిపోతాయి. ఈనూతన పథకం 1960-61 వ విద్యాసంవత్సరం నుంచి అమల్లోనికి వస్తుంది. ఈవ్యయమును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సరిసమానముగా భరిస్తాయి.

భారతదేశ విమోచనానికై సాగిన జాతీయోద్యమాలలో పాల్గొనడము వలన పూర్తి ఆస్తిని లేదా కొంత భాగాన్ని కోల్పోయిన లేదా ఆరునెలలకు తక్కువకాకుండా జెయిలుశిక్ష అనుభవించిన లేక పోరాటములో గాని, నిర్బంధంలోగాని మరణించిన లేదా వధింపబడిన లేదా మరణదండన విధింపబడిన, కాల్పులు, లాఠీచార్జి మొదలయిన వాటివలన శాశ్వతంగా అశక్తులయిన వారు ఈ పథకం నిమిత్తమై రాజకీయ బాధితులుగా పరిగణింపబడతారు.

ఈవిధంగా రాజకీయబాధితులైనట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవాసులయిన వారికి లేదా ఈరాష్ట్రములో స్థిర నివాస మేర్పరచుకున్న వారికీ, తూర్పు పశ్చిమ పాకిస్తాన్‌లనుండివచ్చినవిద్యార్థులకీ ఈసౌకర్యాలు పరిమితం చేయబడుతాయి.

ఈపథకంక్రింద విద్యాసౌకర్యాలు, పైన తెలిపిన విధంగా రాజకీయబాధితులైన వారి పిల్లలకు, మనుమలకు మనుమరాండ్రకు ఒకవేళ ఆరాజకీయ బాధితుల నెలసరి ఆదాయం రు. 400 లకు లోపు అయినట్లయితే లభింపజేయబడుతాయి.

పరిగణింప బడిన విద్యాసంస్థలలో సంతృప్తికరంగా విద్యాభ్యాసంచేస్తున్న పిల్లలకుమాత్రమే ఈసౌకర్యాలు లభింపజేయడమవుతుంది.

ఈ పథకంక్రింద విద్యా సౌకర్యాలకై పెట్టుకునే దరఖాస్తులను నిర్ణీత ఫారములలో వ్రాసి హైదరాబాద్-4 లోని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డైరెక్టరుకు గానీ, లేదా మండలవిద్యాశాఖాధికారికిగాని సందర్భాన్నిబట్టి విద్యార్థి చదువుతున్న సంస్థ అధిపతి ద్వారా ప్రతి సంవత్సరం ఆగస్టు 31 వ తేదీలోపుగా పంపించ వలెను. దరఖాస్తుతో పాటు విద్యార్థి తండ్రి, లేదా తల్లి లేదాతాత పైనిర్వచనానుసారం రాజకీయబాధితుడేనని, అతని-ఆమె ఆదాయం నెలకు రు. 300 లలోపేనని ధృవపరుస్తూ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడి నుంచినిర్ణీత ఫారంలో సర్టిఫికెట్ తీసుకొని జతపరచవలెను.

ఈపథకం క్రింద స్కూలర్ షిప్పులు, పుస్తకాలగాంటులను ప్రైమరీ సెకండరీ పాఠశాలలలో చదువు - పిల్లలకైతే విద్యాశాఖ ప్రాంతీయడిప్యూటీ డైరెక్టరూ, జిల్లా విద్యాశాఖాధికార్లూ, బాలికల పాఠశాలల ఇనస్పెక్టర్లు మంజూరు చేస్తారు. మిగతా విద్యార్థుల విషయంలో అంటే ఆర్ట్సు, వృత్తి కళాశాలలన్నింటిలోనూ, పాలిటెక్నిక్స్‌లోనూ ఇంకా ఇతర మెట్రిక్యులేషన్ అనంతరపు కోర్సులుచదువువారికైతే విద్యాశాఖ డైరెక్టరువీటిని మంజూరు చేస్తారు. రాజమండ్రి, కర్నూలు, నెల్లూరులలోని ప్రభుత్వ శిక్షణ కళాశాలలకు అనుబంధంగా వున్న మోడల్ హయ్యర్ సెకండరీ పాఠశాలలలో చదువుతున్న వారికైతే వీటిని ఆయా శిక్షణకళాశాలల ప్రిన్సిపాల్స్ మంజూరు చేస్తారు. కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాల హయ్యర్ సెకండరీ పాఠశాలలలో విద్యాభ్యాసం చేస్తున్న వారికీ, విజయవాడలోని ప్రాచ్య భాషా పాఠశాలల ఇనస్పెక్టరు, ప్రాచ్యభాషల ప్రాథమిక, మాధ్యమిక, సెకండరీ పాఠశాలల విద్యార్థులకు ఈసౌకర్యాలు మంజూరుచేస్తారు.

బాణసంచా ప్రదర్శనలు

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా 1960 ఆగస్టు 15 వ తేదీరాత్రి దిగువ పేర్కొన్న స్థలాలలో తెలిపిన సమయంలో బాణసంచా ప్రదర్శనలు జరుగుతాయి.

గోషామహల్ స్టేడియం రాత్రి 7-30 గం॥ చార్‌మినార్ రాత్రి 9-0 గం॥ సికింద్రాబాదు పరేడుమైదానం రాత్రి 8-30 గం॥ కర్బలా మైదాన్ రాత్రి 8-45 గం॥ తిరుమల్‌గిరి (మహాంకాళి మందిరం సమీపంలో బజారు బస్ స్టాండ్‌వద్ద) రాత్రి 9-30.

సికింద్రాబాద్ చాపలబావిలో ఈనెల 7 వ తేదీన అశోక గ్రంథాలయం అధ్యక్షులు శ్రీ యర్రం లక్ష్మీనారాయణ మారుతి గ్రంథాలయానికి ప్రారంభోత్సవం చేశారు.

రవాణా నౌకల సంఖ్యనుహెచ్చించాలి

తద్వారా వస్తువుల దిగుమతిలో చెల్లించే ఛార్జీలను మిగల్చాలని కాంగ్రెస్ పార్టీ సిఫార్సు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ నేడిక్కడ ప్రధానినెహ్రూ అధ్యక్షతలో సమావేశమై నౌకల్ని నిర్మించడం ద్వారాగాని కొనడంద్వారాగాని టన్నేజీని హెచ్చించి విదేశీ కంపెనీలకు చెల్లించే ఫ్రైట్ ఛార్జీలను మిగల్చాలని భారత ప్రభుత్వాన్ని ప్లానింగ్ కమిషన్‌ను కోరుతూ తీర్మానించినది.

శ్రీ రఘునాథ్‌సింగ్ యీ తీర్మానంపై చర్చను ప్రారంభిస్తూ ఫ్రైట్ ఛార్జీలుగా చెల్లించే మొత్తంతో 20 నౌకల్ని కొనవచ్చునన్నారు. తన ప్రతిపాదన ఆమోదించబడిన భారత టన్నేజి 10.9 లక్షల నుండి 20 లక్షలకు పెరుగుతుందన్నారు.

అకౌంట్ పరీక్షాఫలితాలు

హైదరాబాద్, ఆగస్టు 12

గడచిన ఏప్రిల్‌లో జరిగిన స్థానిక సంస్థల ఉద్యోగుల అకౌంటు పరీక్షలలో దిగువ రిజిస్టరు నెంబర్లుగల అభ్యర్థులు ఉత్తీర్ణులైనట్టు ప్రకటించబడింది:

ప్రథమ శ్రేణి: 33 38 43 87 111 144 155 159.

ద్వితీయ శ్రేణి: 1 2 3 8 9 11 12 13 18 19 34 37 47 50 51 52 53 54 55 56 62 63 65 67 76 77 78 79 81 85 92 94 95 96 97 98 99 106 110 114 119 122 124 125 126 134 138 145 147 149 151 160 168 178 180 181.

ఈసారి పరీక్ష వచ్చేఅక్టోబరులో జరుగుతుంది. పదిరూపాయల చలానాతోసహా దరఖాస్తుఫారాలుప్రభుత్వ పరీక్షల కమిషనరు కార్యాలయానికి సెప్టెంబరు 10వ తేదీకల్లా చేరాలి. అదనముగా ఒకరూపాయి పెనాల్టీ చెల్లించినట్లయితే సెప్టెంబరు 20 వరకు కూడ తీసుకోబడును. ఈతేదీ తర్వాత వచ్చేదరఖాస్తులు పరిశీలించ బడవు. ఇతర వివరాలు ఆంధ్రప్రదేశ్ గజెటులో చూచి తెలుసుకోవచ్చు.

కార్మిక వివాదాలు

హైదరాబాద్ షాపు ఉద్యోగుల సంఘానికిచెందిన లారీ డ్రయివర్ శ్రీ పి ఆర్. కె. పణిక్కర్‌కు, సుల్తాన్ బజార్‌లో వున్న న్యూ ఇండియా ఫ్రైట్ కారియర్స్ యజమానులకూ మధ్యడ్రయివరును పనినుంచి తొలగించినందుకు కార్మికవివాదం ఏర్పడటాన, యీ వివాదం హైదరాబాదు కార్మిక న్యాయస్థానం తీర్పుకు పంపబడినది

హైదరాబాదుహోటల్ కమ్‌గార్ సంఘానికి చెందిన శ్రీ మోహన్ కేతుకూ, నారాయణగూడా లోని ఇంద్రభవన్ హోటల్ యజమానులకూ మధ్య కేతును పనినుంచి తొలగించినందుకు కార్మికవివాదం ఏర్పడటంచేత, యీ వివాదాన్ని హైదరాబాదు కార్మిక న్యాయస్థానం తీర్పుకు పంపటం జరిగింది.

షక్కర్‌నగర్‌లోని నిజాం పంచదార ఫ్యాక్టరీ మేనేజిమెంటుకు, వర్కర్లకూ మధ్య కొన్ని వర్కర్ల డిమాండ్లవిషయంలో విభేదాలు కలిగినందువల్ల, యీ వివాదాన్ని హైదరాబాదు పారిశ్రామిక న్యాయస్థానం తీర్పుకు పంపారు.

ఉద్యోగుల భీమా కార్పొరేషన్ వివాదాలు

1947 కార్మిక వివాదాల చట్టం క్రింద ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల రాష్ట్ర భీమాకార్పొరేషనుకు కార్పొరేషను ఉద్యోగులకూ మధ్యఏర్పడే వివాదాల విషయంలో రాష్ట్రప్రభుత్వం నిర్వర్తించే విధులను కేంద్రం ఆమోదంతో కేంద్రప్రభుత్వానికి అప్పగించివేయ నిర్ణయం గయికొనబడినది.

రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం

హైదరాబాదులో వున్న రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి జూలై నెలలో వచ్చిన పాఠకులసంఖ్య27556. ఈనెలలో 1428 గ్రంథాలు జారీ చేయబడినాయి.

బాలలవిభాగంలో పాఠకులసంఖ్య 6219. జారీచేసిన గ్రంథాల సంఖ్య 5810.

ఈనెలలోవున్న సభ్యులు 1537 మంది. వీటికి 3476 గ్రంథాలు జారీ చేయటమైంది.

ఆంధ్రకాంగ్రెస్ ఎన్నికలకమిటీ

వివాదపరిష్కారానికి కామరాజ్ కృషి

న్యూఢిల్లీ, ఆగస్టు 12

ఆగస్టు 28 న ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిటీ తిరిగి ఎన్నుకోబడుతున్న సందర్భంగా ఆంధ్ర కాంగ్రెసులోని ఉభయవర్గాల మధ్య రాజీకుదర్చడానికి ప్రయత్నించవలసిందిగా కాంగ్రెసు అధిష్ఠానవర్గం మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ నాడార్‌ను కోరిందనీ అధిష్ఠానవర్గం ప్రతినిధి ఒకరుయిక్కడచెప్పారు.

బ్యాలట్ పత్రాల రహస్యం కాపాడబడలేదనే కారణంగా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి యిటీవలనే ఆంధ్ర కాంగ్రెసు ఎన్నికల కమిటీని రద్దుచేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య, మాజీ మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి మధ్య- శ్రీ సుబ్బారెడ్డి ఎన్నికలకమిటీకి ముఖ్యమంత్రి అభిమతానికి పోటీచేసినందున- చెలరేగిన వివాదం తరువాత ఆచార్య గైకొనబడింది.

శ్రీ కామరాజ్ ఆగస్టు 22 న హైదరాబాద్ వెళ్ళి తన రాజీ ప్రయత్నాలను ప్రారంభిస్తారు. ఆంధ్ర కాంగ్రెసు కార్యవర్గం ఆగస్టు 18 న సమావేశమౌతుంది.

(పి.టి.ఐ)

ఉద్యోగుల ప్రభుత్వ భీమాపథకం విస్తరణ

ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లలోని 5,250 మంది పనివారికి సౌకర్యాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

ఉద్యోగుల ప్రభుత్వభీమాపథకాన్ని 1960 ఆగస్టు 18అర్ధరాత్రినుంచి ఆంధ్రప్రదేశ్‌లో అదోని, కాకినాడకు, రాజస్థాన్‌లో ఉదయపూర్, భరత్‌పూర్ లకు విస్తరింపచేస్